ప్రజాశక్తి
శనివారం 14 అక్టోబర్ 2023 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



మచిలీపట్నంలో జరిగిన ప్రజాబ్యాలెట్లో వై.నరసింహారావు తదితరులు

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్

జిల్లావ్యాప్తంగా ప్రజా బ్యాలెట్‌కు విశేష స్పందన

తమది పేదల ప్రభుత్వం, పెత్తందారులపై తమ పోరాటం అని చెబుతూ ప్రజలపై భారాలు వేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు వామపక్ష పార్టీల నాయకులు స్పష్టం చేశారు. విద్యుత్ సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం కృష్ణాజిల్లావ్యాప్తంగా ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో సిపిఎంతోపాటు సిపిఐ, సిపిఐ ఎంఎల్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వత్తిడి మేరకు రకరకాల పేరుతో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

(పూర్తి వివరాలు 5వ పేజీలో)

నేడు 'విద్యా రంగం'పై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజా వికాస వేదిక ఆధ్వర్యాన శనివారం ఉదయం 10 గంటలకు 'విద్యా రంగం'పై రాష్ట్రస్థాయి సదస్సు జరుగుతుందని వేదిక బాధ్యులు ఎస్.పి.రామరాజు తెలిపారు. నగరంలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సోషల్ సైన్సెస్ ట్రస్ట్ బాధ్యులు ఎ.జగన్నాధరావు అధ్యక్షతన జరిగే ఈ సదస్సును హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ కె.చిన్నయసూరి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం జరిగే మొదటి సెషన్లో 'ఉన్నత విద్యా రంగం - స్థితిగతులు' అంశంపై ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, 'పాఠ్యప్రణాళిక - పాఠశాల విద్య' అంశంపై ఎపి విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్, 'పాఠశాల విద్య - స్థితిగతులు' అంశంపై మాజీ ఎంఎల్‌సి, విద్యావేత్త విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడతారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే రెండో సెషన్లో 'పాఠశాల విద్య - బోధనా సమస్యలు' అంశంపై మాజీ ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి, 'పాఠశాల విద్య - భాషా విధానం' అంశంపై విద్యా సంస్కరణోద్యమ కార్యకర్త డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్, 'విద్య - ఫిస్కల్ పాలసీ' అంశంపై ప్రొఫెసర్ ఎం.సురేష్‌బాబు మాట్లాడతారని తెలిపారు.

రేషన్...పరేషాన్

పంపిణీకి సాంకేతిక సమస్యలు • 13 రోజుల్లో పంపిణీ జరిగింది 50.54 శాతమే
• మరోపక్క యథేచ్ఛగా అక్రమ రవాణా • 10 నెలల్లో రూ.76.96 లక్షల బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

రేషన్ పంపిణీలో తరచూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. సర్వర్ పనిచేయడం లేదనే కారణంతో శుక్రవారం పంపిణీ నిలిచిపోయింది. ఈనెలలో గడచిన 13 రోజుల్లో 50.54 శాతం మాత్రమే రేషన్ పంపిణీ జరిగింది. కానీ మరోపక్క రేషన్ బియ్యం అక్రమ రవాణా పెరిగిపోతోంది.

రేషన్ బియ్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొబైల్ డిస్పెన్సింగ్ యునిట్స్ (రేషన్ పంపిణీ వ్యాన్, ఎండియు) వద్దకు శుక్రవారం వెళ్లిన కార్డుదారులకు నిరాశ ఎదురైంది. సర్వర్ పనిచేయడం లేదనే కారణంతో ఎండియు వ్యాన్ నిర్వాహకులు బియ్యం పంపిణీ చేయలేదు. దీంతో కార్డుదారులు నిరుత్సాహంగా తిరిగి రావాల్సి వచ్చింది. ఈసమస్య శుక్రవారం ఒక్కరోజే కాదు..ఈనెల ఒకటో తేదీన రేషన్ పంపిణీ ప్రారంభమైనప్పటి నుండీ ఎదురవుతోంది. ఈ సమస్య రానురాను తీవ్రమవుతోంది. దీంతో రేషన్ లబ్ధిదారులు ఎండియు వ్యాన్ల చుట్టూ రోజూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. గంటల కొద్దీ వ్యాన్ల వద్ద నిరీక్షించాల్సి వస్తోంది. ప్రతి నెలా 1 నుండి 15వ తేదీ వరకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తారు. కృష్ణాజిల్లాలోని 5,33,424 రేషన్ కార్డుదారుల్లో ప్రతి నెలా 93 శాతం మందికిపైగా రేషన్ అందుకుంటున్నారు. అయితే ఈసారి అక్టోబర్ 13వ తేదీ నాటికి కేవలం 2,69,615 మందికి మాత్రమే రేషన్ పంపిణీ చేశారు. మొత్తం కార్డుల సంఖ్యలో ఇది 50.54 శాతమే.

పంపిణీ గడువు పెంచితేనే

ప్రతి నెలా 15వ తేదీతో రేషన్ పంపిణీ గడువు ముగుస్తుంది. ఆ తేదీలోపే లబ్ధిదారులు రేషన్ తీసుకెళతారు. ఈనెలలో 13వ తేదీ వచ్చినా 50.54 శాతం మాత్రమే రేషన్ పంపిణీ జరిగింది. జిల్లాలో ఇంకా 2,63,809 మందికి రేషన్ పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో రేషన్ అందుకునేందుకు వీలుగా రేషన్ పంపిణీ గడువు పెంచాలని కార్డుదారులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

రేషన్ బియ్యం అక్రమ రవాణా కొందరికి భారీ ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది. దీన్నిని కొందరు తమ వృత్తిగా మార్చేసుకున్నారు. కార్డుదారుల నుంచి కిలో 10 రూపాయలకు కొనుగోలు చేసి వివిధ మార్గాల్లో కాకినాడ పోర్టుకు తరలించి అక్కడి నుండి విదేశాలకు (మిగతా 6లో)



పంపిణీ గడువు పెంచుతాం

వి.పార్వతి, పౌర సరఫరాల అధికారి, కృష్ణాజిల్లా

ఈనెల 5వ తేదీ నుండి రేషన్ పంపిణీలో సమస్య వస్తోంది. సర్వర్ల సమస్యా లేక డేటా సెంటర్ సమస్యా అన్నది ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఈనెలలో ఇప్పటి వరకు 50.54 శాతం మాత్రమే రేషన్ పంపిణీ జరిగింది. పంపిణీ గడువును పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం.

దసరా ఉత్సవాల్లో

పారిశుధ్యం...అగమ్యగోచరం...

● టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ సామర్థ్యంపై సందేహాలు
● బినామీకి రూ.36 లక్షల విలువైన పనులు అప్పగింత ?

ప్రజాశక్తి - విజయవాడ : ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు నియమించే పారిశుధ్య సిబ్బంది వ్యవహారం చర్చనీయాంశమవుతోంది. ఈనెల 14 నుంచి 24 వరకు ప్రత్యేకంగా పారిశుధ్యంపై దృష్టి పెట్టాల్సి ఉంది. కాంట్రాక్టర్ ద్వారా కార్మికులను భర్తీ చేసుకొని ప్రజారోగ్య విభాగం పర్యవేక్షణలో శనివారం నుండి నుండే పారిశుధ్య నిర్వహణ చేపట్టాల్సి ఉంది. అయితే ఉత్సవాల్లో పారిశుధ్య నిర్వహణ పనిని చేజిక్కించుకున్న కాంట్రాక్టర్, ఆయన తరుపున కార్మికులను భర్తీ చేసే పనిని తీసుకున్న ఓ వ్యక్తి (కాంట్రాక్టర్ బినామీ) వ్యవహారంపై విఎంసిలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఆ వ్యక్తిపై ప్రజారోగ్య విభాగంలోని అధికారుల్లోనే అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది సందర్శకులు, వాహనాలతో నగరంలో అనేక రూపాల్లో తీవ్ర రద్దీ పెరిగిపోతుంది. ఉత్సవాలు జరిగే 9 రోజులతోపాటు ఉత్సవాలకు ముందు రోజు, ముగిసిన తరువాత ఒక రోజు మొత్తం 11 రోజులు పారిశుధ్య నిర్వహణకు విజయవాడ నగర పాలక సంస్థ రూ.36 లక్షలు కేటాయించింది. ఈ నిధుల భారాన్ని దుర్గగుడి భరిస్తుందని విఎంసి అధికారులు చెబుతున్నా.. గత అనుభవాల రీత్యా ఈభారం కూడా విఎంసిపైనే పడుతుందని చెప్పక తప్పదు. దుర్గగుడి పరిసర ప్రాంతాలతోపాటు స్నాన ఘాట్లు తదితర 25 ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు రోజుకు వెయ్యి మంది కార్మికులతో మూడు షిఫ్ట్‌లుగా పని చేయించాలి. షిఫ్ట్‌కు 375 మంది చొప్పున ఉదయం, మధ్యాహ్నం, 250 మందితో రాత్రి షిఫ్ట్ విధులు నిర్వహించాలి. ఈ నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ కాంట్రాక్టు టెండరు ప్రక్రియను విఎంసి ఇంజినీరింగ్ విభాగంలో వెహికల్ డిపో అధికారులు నిర్వహించారు. వన్‌టౌన్‌కు చెందిన పోతిన నరసింహారావు ఈ టెండరును చేజిక్కించుకున్నారు. అయితే ఆయన తరుపున గతంలో (మిగతా 6లో)



సాంస్కృతిక 'ఉత్సవం'

అలరించిన 'సేఫ్' కళా ప్రదర్శనలు

వార్త 4లో



ఆర్‌టిసిలో దసరా 'సందడి'

● పిఎన్ బస్టాండ్ కిటకిట ● విజయవాడ నుండి వెయ్యి ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు
● సాధారణ ఛార్జీలతోనే ప్రయాణం, పలు రాయితీలు : జిల్లా అధికారి యేసుదానం

ప్రజాశక్తి - విజయవాడ : దసరా సెలవుల నేపథ్యంలో ఆర్‌టిసి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా ఎపిఎస్ ఆర్‌టిసి ఎన్‌టిఆర్ జిల్లా రీజియన్ అధికారులు వెయ్యి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈనెల 13 నుంచి 26వ తేదీ వరకు ఈ సర్వీసులను నడుపుతారు. ఎన్‌టిఆర్ జిల్లా నుంచి వివిధ దూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ఎటువంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకుండానే సాధారణ ఛార్జీలతోనే వీటిని ఏర్పాటు చేశారు. ప్రధానంగా హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు నుంచి విజయవాడకు, ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లోని పలు పట్టణాలు, నగరాలకు అదనపు సర్వీసులను ఏర్పాటు చేసి రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. విజయవాడ నుంచి విశాఖపట్నం, కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం, తిరుపతి, భద్రాచలం, రాయలసీమ తదితర ప్రధాన రూట్లకు ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు 227 సర్వీసులు, (మిగతా 6లో)

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: గురుకులంలో చదివే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ సామినేని ఉదయ భాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులు సమకూ రుస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బోధనలోనూ అత్యాధునిక పద్ధతులతో విద్యార్థులను అత్యున్నతంగా తీర్చిదిద్దు తోందని అన్నారు.

సిపిఎం నాయకుడిపై ఫోన్‌లో దుర్భాషలు

ప్రజాశక్తి - నందిగామ : శనగపాడు సప్లై ఛానల్ ద్వారా అనాసాగరం, నందిగామ చివర భూములకు సాగునీరు ఇవ్వాలని రైతు సంఘాలతో కలిసి ఆందోళన చేస్తున్న అనాసాగరం గ్రామ నాయకుడు, నందిగామ సిపిఎం నాయకులు కర్రి వెంకటేశ్వరావుకు నందిగామ సొసైటీ చైర్మన్ పాములపాడు రమేష్ గురువారం రాత్రి ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం. శనగపాడు సప్లై ఛానల్‌కు తమ సొంత నిధులతో తాత్కాలిక మరమ్మత్తులు చేయిస్తే డబ్బులు తీసుకున్నారని ఆరోపణ చేయటం ఏమిటని సొసైటీ చైర్మన్ ఫోన్ చేసి అసభ్యపదజాలంతో మాట్లాడటం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రజా ఉద్యమాలు చేస్తున్న నాయకులపై ఎదురు దాడి చేయడం హేయమైన చర్య అని అనాసాగరం రైతులు ఖండిస్తున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు తమ తప్పు తెలుసుకొని ప్రజా సంఘాల నాయకులకు క్షమాపణ చెప్పాలని అనాసారం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

ప్రజాశక్తి -నందిగామ : నందిగామ కెవిఆర్ కళాశాలలో జాతీయ సేవ పథకం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. కళాశాల క్యాంపస్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించారు. హరితహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.ఎం.వి.వై స్వామి, అధ్యాపకులు , సిహెచ్.కిషోర్, కె.రమేష్ బాబు, ఎన్.ఎస్.ఎస్ సమన్వయ కర్తలు పాల్గొన్నారు.

సంపూర్ణ కుళాయి గ్రామంగా 'నెమలి'

ప్రజాశక్తి - గంపలగూడెం : నెమలి గ్రామంలో ఇంటింటా కుళాయిని ఏర్పాటు చేసినట్లు ఆ గ్రామ సర్పంచ్ దుబ్బాకుల రామకృష్ణ తెలిపారు. జలజీవన్ మిషన్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంగా, తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సభ ఏర్పాటు చేసి మాట్లాడుతూ అర్ ఘర్ జెల్ గ్రామంగా, డిక్లేర్ చేశారు. ఈ కార్యక్రమానికి కృష్ణ సంయుక్త జిల్లా కోఆర్డినేటర్లు రామకృష్ణ, నాగేశ్వరరావు, ప్రాజెక్టు మేనేజర్ రామ శేష చార్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలన మందు అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఎడిఎసి భవాని మాట్లాడుతూ వరి పొలంలో నారుమడి దశ నుండి కోత, నిల్వ సమయంలో కూడా ఎలుకలు అనేక విధాలుగా ధాన్యాన్ని నష్టపరుస్తాయి కావున రైతులు నష్టపోకుండా ఎలుకలు నిర్మూలన చేపట్టడం కోసం ప్రభుత్వం వారు 100 శాతం రాయితీపై బ్రోమోడయోలిన్ ఎలుకల మందు రైతులకు అందించడం జరుగుతుందన్నారు. బ్రోమోడయోలిన్ విషపు ఎర తయారు చేయడానికి 96 పాళ్ళ నూకలు, 2 పాళ్ళ నూనె, 2 పాళ్ళ బ్రోమోడయోలిన్ మందును కలిపి 10 గ్రాముల పొట్లాలుగా చేసి ఎలుక బొరియలో పెట్టడం వలన ఎలుకలు నిర్మూలన చేసుకోవచ్చని తెలియచేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం లైన్సక్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట, ఆంధ్రహాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని తహశీల్దార్ ఎం.సూర్యారావు ప్రారంభించారు. రెవెన్యూ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు 2 డి, ఎకో పరీక్ష, కంటి పరీక్షలు, కిడ్నీ స్కానింగ్, దంత పరీక్షలు, చెవి పరీక్షలు, బోన్ స్కానింగ్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ శిబిరంలో 20 శాతం రాయితీ కల్పించే ఉచిత హెల్త్ కార్డులను అందజేశారు.

శనగపాడు సప్లై ఛానల్‌కు తాత్కాలిక మరమ్మతులు

ప్రజాశక్తి- నందిగామ : రైతు సంఘాలు ప్రజా సంఘాలు రైతుల సమిష్టి పోరాటం ఫలితంగా అధికార యంత్రాంగం కదలడంతో శనగపాడు సప్లై ఛానల్ ద్వారా నందిగామ, అనాసాగరం గ్రామాల పరిధిలోని చివర భూములకు సాగునీరు అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనగపాడు సప్లై ఛానల్ కింద సుమారు 1200 ఎకరాలు పత్తి, మిర్చి, మాగాణి పంట సాగవుతున్నది. గత నెల రోజుల నుండి వర్షాభావం వల్ల పంటలకు సాగునీరు లేక నిలువునా ఎండిపోతున్నాయి. శనగపాడు సప్లై ఛానల్ చెక్ డ్రైం వద్దా? మున్నేరు నుండి నీరు అందకపోవడంతో నందిగామ ఎంఎసి చైర్మన్ మస్తాన్ సొసైటీ చైర్మన్ పాములపాటి రమేష్ స్పందించి ప్రొక్లైన్ ద్వారా చెక్ డాం వద్ద పూడికలు తీయించారు. చెక్ డాం వద్ద ఉన్న బండ రాళ్ళు తొలగించి నీరు కిందకి వచ్చేలా



శనగపాడు సప్లై ఛానల్ చెక్ డ్యామ్ వద్ద వస్తున్న సాగునీరు

చేయడంతో కాలువల ద్వారా నీరు చివర భూములకు చేరాయి. మోటార్ల ద్వారా పత్తి మిర్చి మాగాని పంటలకు సాగునీరు అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమాచార హక్కు చట్టం బోర్డులుండాలి

ప్రజాశక్తి- నందిగామ : సచివాలయాల్లో కూడా సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం నందిగామ మున్సిపల్ కార్యాలయంలో నందిగామ ప్రముఖులతో సచివాలయ ఉద్యోగుల సమీక్ష జరిగింది. గ్రామ వార్డు సచివాలయ సిబ్బందిని కూడా సమాచార హక్కు చట్ట పరిధిలోకి తీసుకువస్తూ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 437 జీ. వో . ఇచ్చిన నేపథ్యంలో సచివాలయ ఉద్యోగులైన అడ్మిన్లు డిజిటల్ అసిస్టెంట్లు, వాలెంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు.ముఖ్య అతిథిగా నందిగామ మునిసిపల్ కమీషనర్ యస్. జయరామ్ విచ్చేసారు. ఆర్.ఐ.ప్రసాద్ కార్యక్రమాన్ని సమన్వయ పరిచారు.

లబ్ధిదారుల నిరసన

జి.కొండూరు : జి.కొండూరు మండలం వెలగలేరు గ్రామంలోని జగనన్న లేఔట్ లబ్ధిదారులు శుక్రవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా మద్దతు తెలిపిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ పేదలకు హెచ్.ముత్యాలంపాడు పరిధిలో 3.1.2020న జగనన్న వసతి గృహాలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేశారన్నారు. ఈ గ్రామ పరిధిలో సుమారు 240 మందికి పట్టాలిచ్చారని గుర్తు చేశారు. పట్టాలు ఇచ్చినప్పటి ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి ఆ లేఔట్‌లో జరగలేదని పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు కరెంటు నీళ్లు రోడ్లు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు తిరిగినా పొంతనలేని సమాధానంతో విసికెత్తిపోయారన్నారు. మెరక ప్రాంతమైన వెలగలేరు గ్రామంలోభూమిని కొనకోకుండా బుడమేరు వరద ముంపుప్రాంతమైన



మాట్లాడుతున్న కోట కళ్యాణ్

హెచ్.ముత్యాలంపాడు భూమిని కొనుగోలు చేయడంపై గతంలోనూ కొంతమంది మండల స్థాయి నాయకులపై తీవ్ర ఆరోపణలు వచ్చాయన్నారు. అవసరమైతే ఇళ్లు కట్టుకోండి సౌకర్యాలు తర్వాత వస్తాయని ఇళ్లు కట్టకపోతే పట్టాలు వెనక్కి తీసుకుంటామని బెదిరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆ స్థలంలో సౌకర్యాలు కల్పించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జి కొండూరు మండల కార్యదర్శి కొంక బాలకృష్ణ సిఐటియు నాయకులు ఎర్రగుంట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు పంపిణీ



ఉపకార వేతనాలిస్తున్న వెంకయ్య

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రపంచీ కరణతో దేశదేశాల మధ్య వాణిజ్యం పెరిగిందని, దేశ ప్రగతికి రహదారులు వెన్నెముక అని గుర్తించి ప్రాథమిక, మౌలికరంగం అనదగిన రవాణారంగానికి మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు పునాది వేయగా, మాజీ ప్రధాని వాజ్ పేయి హయాంలో రవాణా వ్యవస్థ విస్తరించిందని భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలో కృష్ణాడిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ నిర్వహించిన ఉపకార వేతనాలు (స్కాలర్ షిప్) పంపిణీ కార్యక్రమంలో వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బిజెపి ఏలుబడిలో జాతీయ రహదారుల రూపురేఖలు మారిపోయాయని, రోడ్లు, రైలు, ఇంటర్నెట్ కనెక్టివిటీ ఊపందుకుని దేశ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పు లు వచ్చాయన్నారు. రాష్ట్ర మాజీమంత్రి కామినేని శ్రీనివాస్, లైలా గ్రూప్ అధినేత గోకరాజు గంగరాజు, ఫౌండేషన్ మాజీ అధ్యక్షులు పిన్నేప్రసాదరావు, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి వై వి ఈశ్వరరావు, ఫౌండేషన్ కార్యదర్శి కుర్ర సాయిరాం పాల్గొన్నారు.

మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: ప్రభుత్వం అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు చిరు వ్యాపారాలు చేసుకుంటూ స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని 26వ వార్డు నకసి బజార్‌లో శుక్రవారం కషి మహిళా దుర్గ భవాని మహిళా సమైక్య సర్వసభ్య సమా వేశాన్ని నిర్వహిం చారు. ఈ కార్య



మాట్లాడుతున్న సామినేని ఉదయభాను

క్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలుచోట్ల ఆరోగ్య సురక్ష శిబిరాలు

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఎల్ఎ మొండితోక జగన్‌మోహన్‌రావు రోగులను మందులపై వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కోటేరు శ్రీలక్ష్మి మండల అభివృద్ధి అధికారి అరుంధతి దేవి, మండల తహశీల్దారు, ప్రజాప్రతినిధులు, అధికారులు, డాక్టర్ బి. గౌతమ్ బాబు డాక్టర్ దీపిక డాక్టర్ స్నేహ డాక్టర్ దీప్తి ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **చందర్లపాడు:** మండలంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని ఎంఎల్ఎ మొండితోక జగన్మోహన్‌రావు ప్రారంభించి మాట్లాడారు. **కంచికచర్ల :** కంచికచర్ల మండలం కొత్తపేట గ్రామంలో శుక్రవారం నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు ప్రారంభించారు. ఎంపిడిఒ కె.శిల్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు పరిశీలించారు. అవసరమైన వారికి ఎమ్మెల్యే మందులు అందజేశారు. అనంతరం పౌష్టికాహార స్టాల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపిపిలు బండి మల్లిఖార్జున్ రావు, వెలగలేటి మాధవి, కార్యదర్శి అనిత, ఎంఈఓ బాలాజీ తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నగర పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణనిధి శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరి బాయి, వైస్ చైర్మన్లు వెలుగోటి విజ యలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న వలవెన్

ప్రజాశక్తి - వన్‌టౌన్

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనార్థం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.కరికల్ వలవెన్ శుక్రవారం విచ్చేశారు. వీరికి ఆలయ మర్యాదలతో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కె. ఎస్. రామరావు స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు.

16న వాహనాలు వేలం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తిరువూరు స్టేషన్‌లో వివిధ కేసుల్లో సీజ్ చేయబడిన వాహనాలకు ఈనెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు సిఐ గురవయ్య తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు పాడుకున్న నగదుకు అదనంగా 18 శాతం జిఎస్‌టి చెల్లించవల్సి ఉంటుందన్నారు. ద్విచక్ర వాహనానికి రూ.5వేలు, నాలుగు చక్రాల వాహనానికి రూ10 వేలు చొప్పున ఇఎండి కట్టి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని అనుములంక గ్రామంలో ఇటీవల తరచూ విద్యుత్ అంతరాయం ఉండేది. ఆ గ్రామ వైసిపి నాయకులు గౌరసాని శ్రీనివాస్ రెడ్డి, అత్తనూరి పద్మా రెడ్డి తిరువూరు ఎమ్మెల్యేకే రక్షణ దష్టికి తీసుకుపోగా స్పందించి, విద్యుత్ శాఖ అధికారులను మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం సదరు ఎఇ కొమ్ము వాసు మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీనితో విద్యుత్ అంతరాయం తొలగి, ప్రజా మంచినీటి సరఫరా సజావుగా సాగేందుకు వీలు పడుతుంది.



సాగునీరు కోరుతూ నిరసన

ప్రజాశక్తి-కోడూరు: దివిసీమలోని తీర ప్రాంత గ్రామాలకు సక్రమంగా సాగునీరు అందించాలని కోరుతూ అవనిగడ్డ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఆధ్వర్యంలో ఒకరోజు నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మర్రే గంగయ్య మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాల్లో సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి తీర ప్రాంత గ్రామాలకు సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో జనసేన, టిడిపి ఉమ్మడిగా కార్యాచరణ రూపొందించి ఉద్యమాన్ని చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, ఎంపిటిసి సభ్యులు లంకె భాస్కరరావు, యర్రంశెట్టి దామోదర్‌రావు, తోట దామోదర్‌రావు పాల్గొన్నారు.

మరియ మాత జపమాల

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గురువారం రాత్రి జగ్గయ్యపేట విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జె.జయరాజ్ ఆధ్వర్యంలో అక్టోబర్ నెల జపమాల నెల కావడంతో జపమాల మాత పండుగ ఘనంగా నిర్వహించారు.

విరాళం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: రాజన్న ఉచిత భోజన కార్యక్రమానికి విజయవాడ దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి రూ.20 వేలు వితరణగా అందజేశారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగించుకోండి

వికలాంగులకు కేంద్ర మంత్రి సూచన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఏ.నారాయణస్వామి అన్నారు. మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఆయన ఆ శాఖ ఆధ్వర్యంలోని అలింకో సంస్థ ద్వారా 420 మంది వికలాంగులకు రూ.46.97 లక్షల విలువైన ట్రై సైకిళ్లు, వీల్ ఛైర్లు, వినికిడి పరికరాలు, బ్రెయిలీ కిట్లు, కత్రిమ అవయవాలు తదితర పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బందరు ఎంపి వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి కష్ణాజిల్లాలో 1,35,000 మంది వికలాంగులు మండడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉండటానికి గల కారణాలను విశ్లేషించాలని కోరారు. కష్ణా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎస్సి హాస్టల్ ఏర్పాటుకు రూ.12 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరగా, అందుకు ఆయన



అంగీకరించారు. కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో 32 వేల మంది వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా రూ. 3 వేల చొప్పున పింఛన్లు అందిస్తోందన్నారు. ఎంపీ చొరవతో 2021 డిసెంబర్ 17 నుండి 30 వరకు, 2022 జనవరిలో వికలాంగుల గుర్తింపు శిబిరాలు నిర్వహించి రూ.5.05 కోట్ల విలువైన ఉపకరణాల పంపిణీకి 2717 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అలింకో డీజీఎం సంజయ్ సింగ్, డిఆర్వో పి వెంకటరమణ జడ్పీ సీఈవో జ్యోతి బసు, ఆర్డీవో ఇన్చార్జ్ బి శివ నారాయణ రెడ్డి, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంపటి చినసత్యం జయంతికి ఏర్పాట్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈ నెల 15వ తేదీన కూచిపూడిలో పద్మభూషణ్ వెంపటి చిన సత్యం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రాష్ట్ర సజనాత్మకత సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆర్ మల్లికార్జున రావు తో కలిసి డాక్టర్ వెంపటి చినసత్యం జయంతి వేడుకల ఏర్పాట్లపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంపటి చిన సత్యం స్వస్థలమైన కూచిపూడిలో ఘనంగా వేడుకల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ వేడుకల్లో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక యువజన అభ్యుదయ శాఖ మంత్రి ఆర్కె రోజా పాల్గొంటారన్నారు.

భద్రంగా ఓటింగ్ యంత్రాలు

జిల్లాకు వచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కలెక్టరేట్లో జాగ్రత్తగా భద్రపరిచామని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి స్థాయి తనిఖీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.



.ప్రెస్క్లబ్ను స్వాధీనం చేసుకోండి

అందరినీ భాగస్వాములను చేయండి

కలెక్టర్కు జర్నలిస్టు సంఘాల జెఎసి నేతల వినతి

ప్రజాశక్తి - విజయవాడ : గాంధీనగర్లోని ప్రెస్క్లబ్ ఏదో ఒక యూనియన్కు సంబంధించినగా నిర్వహిస్తున్నారని, దానిని అందరి ప్రెస్క్లబ్గా చేయాలని కోరుతూ గురువారం పలు జర్నలిస్టు సంఘాలు జెఏసిగా ఏర్పడి ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు వినతిపత్రం సమర్పించాయి. నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ డిల్లీరావును జర్నలిస్టు సంఘాల నేతలు కలిసి ప్రెస్క్లబ్ వ్యవహారాల గురించి వివరించారు. విజయవాడ ప్రెస్క్లబ్ ఎపియుడబ్ల్యుజె కబంధ హస్తాల్లో చిక్కుకుపోయిందని, ప్రెస్క్లబ్ కార్యకలాపాలకు విరుద్ధంగా అక్కడ వ్యవహారాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్క జర్నలిస్టుకు సభ్యత్వం ఇచ్చి ప్రెస్క్లబ్ను కాపాడాలని విన్నవించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం 1971 జూలైలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఈ ప్రెస్క్లబ్ను ప్రారంభించారని గుర్తుచేశారు. అయితే ఆంప్రప్రదేశ్ యునియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ తమ యూనియన్ కార్యకలాపాలకు వినియోగించుకోవడమే తప్ప నగరంలోని జర్నలిస్టులందరినీ భాగస్వాములను చేయడంలేదని కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. నగరంలో 1500 మందికిపైగా అక్రిడేటెడ్ జర్నలిస్టులు ఉన్నారని, కానీ ఆ యూనియన్ 122 సభ్యత్వాలనే ప్రెస్క్లబ్ సభ్యత్వంగా చూపి ఎన్నికలు నిర్వహించి కమిటీలను ఎన్నుకుంటున్నారని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం దీనిని స్వాధీనం చేసుకుని 'అందరి ప్రెస్క్లబ్'గా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలలో ఇలానే ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ను కలిసిన వారిలో వివిధ సంఘాల నేతలు వీర్ల శ్రీరామ్ యాదవ్, గాంధీ, కె.ప్రసాద్బాబు, యేమినేని వెంకట రమణ, అనిల్ కుమార్, ఎ.వి.వి. శ్రీనివాసరావు, ప్రశాంత్, కోట రాజా, పి.బాబూరావు, వై.ఎన్.కిషోర్, మల్లిఖార్జునరావు, బాబు, ఎన్.శ్రీనివాసరావు, సురేష్ తదితరులు ఉన్నారు.



డ్వాక్రా సొమ్ము స్వాహా?

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం పోలాటి తిప్ప గ్రామానికీ చెందిన గ్రామ సమైక్య అధ్యక్షురాలు తమ్ము పద్మ గ్రామంలోని 56 గ్రూపులు 700 మంది డ్వాక్రా సభ్యుల నుండి దాదాపు 5 కోట్ల వరకు దోపిడీ చేసిందని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చెయ్యగా ఎట్టకేలకు శుక్రవారం గ్రామంలో తుపాను షెల్టర్ వద్ద లెక్కలు చూశారు. పలు సంఘాల్లో ఒక్కో సంఘం నుండి 50 వేల నుండి 5 లక్షల వరకు దోపిడీ జరిగిందని సుమారుగా ఐదు కోట్ల వరకు ఉండవచ్చని అధికారులు గ్రామ పెద్దలు గుర్తించారు. సిండికేట్ బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ సమైక్య అధ్యక్షురాలు కలిసి గ్రామస్తులను నట్టేట ముంచేసారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గన్నవరం: విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం 14న ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఏ హరిబాబు తెలిపారు. గన్నవరం, మర్లపాలెం,చిన్న అవుటపల్లి, దావాజీగూడెం, అల్లాపురం, రాజీవ్ కాలనీ, ఎస్టిబిఎల్ కాలనీ, దుర్గాపురం, ఎయిర్పోర్టు సిటీ, బీబీ గూడెం, గొల్లనపల్లి, చిక్కవరం ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి : రమేష్బాబు

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బచ్చు బేబీ గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సింహాద్రి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్య రంగంలో డిజిటల్ టెక్నాలజీది ప్రముఖ పాత్ర

బిఐఎస్ విజయవాడ ఛాప్టర్ సీనియర్ డైరెక్టర్ వినోద్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: వైద్య రంగంలో డిజిటల్ టెక్నాలజీ ప్రముఖ పాత్ర వహిస్తుందని బిఐఎస్ విజయవాడ బ్రాంచ్ కార్యాలయం సీనియర్ డైరెక్టర్ హెచ్. వినోద్ అన్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ మినర్వా గ్రాండ్ నందు ప్రపంచ ప్రమాణాల దినోత్సవం - 2023 కార్యక్రమం శుక్రవారం జరిగింది.ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జనాభా కోసం సమర్థవంతమైన సురక్షితమైన, విశ్వసనీయమైన వైద్య పరికరాలు, ఆరోగ్య సేవలు, వ్యవస్థపై స్వదేశీ ప్రమాణాలను అభివృద్ధి చేయడంలో బిఐఎస్ ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. వైద్య రంగంలో డిజిటల్ టెక్నాలజీతో అభివృద్ధి చెందుతున్న రంగాలను గురించి ఆయన కూలంకుషంగా తెలియచేశారు. బిఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) జాయింట్ డైరెక్టర్ సుజాత మాట్లాడుతూ మన దైనందిన జీవితంలో మనం కొనుగోలు



మాట్లాడుతున్న వినోద్

చేసే వస్తువులు ఏవిధంగా ఉన్నాయో వాటి నాణ్యత గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దైనందిన జీవితంలో ఆరోగ్యకరమైన జీవితాలను ప్రోత్సహించడంలో అన్ని వయసుల వారి శ్రేయస్సును ప్రోత్సహించడంలో ప్రమాణాలు ఎలా ముఖ్యమైన పాత్ర వహిస్తాయో తెలియచేశారు. ఈకార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ ముఖేష్ త్రిపాటి, ప్రొఫెసర్ డాక్టర్ జి.మోహన్ రోవా, పలువురు వైద్యులు, వైద్య రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

ప్రజాశక్తి-బంటుమిల్లి: కొమ్మారెడ్డి పాఠశాలలో శుక్రవారం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. సాంప్రదాయ భక్తి గీతం తో కార్యక్రమం ప్రారంభమైనది. అనంతరం ఆరో తరగతి చదువుతున్న మణిదీప్ దసరా పండగ విశిష్టత గురించి వివిఎల్ అజయ్ మహిషాసుర వద కథను విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని సాంబశివరాజు అమ్మవారి యొక్క ఒక్కొక్క అవతారం విశిష్టతను వివరించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు అమ్మవారి అవతారాలు ధరించి వేషధారాలతో భక్తి శ్రద్ధలతో పిల్లలను ఆనందముక్తులు చేశారు సాంప్రదాయ డ్యాన్స్ తో విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కొమ్మారెడ్డి డైరెక్టర్ కిషోర్ మాట్లాడుతూ భారతీయ సాంస్కతిక సాంప్రదాయాలను చిన్న వయసు నుండే తెలియజేయాలని ఉద్దేశంతో ప్రతి పండగను విద్యార్థులతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంటుమిల్లిలో సెయింట్ జాన్స్ హైస్కూల్లో దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు విశేష వేషాలతో ఫ్యాషన్ షోతో అందరిని


కొమ్మారెడ్డి పాఠశాలలో...

ఆకట్టుకున్నారు. స్కూల్ డైరెక్టర్ సాబు జాను ఝాన్సీ సాబ్ విద్యార్థినిలను అభినందించారు.



శ్రీ ప్రజ్ఞలో విజయదశమి వేడుకలు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం లోని శ్రీ ప్రజ్ఞ స్కూలులో శుక్రవారం ముందస్తుగా విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథులుగా పాఠశాల డైరెక్టర్ శ్రీ, సూరి పవన్ కుమార్, ఎగ్జిక్యూటివ్ బైరి రంజిత్కుమార్ పాల్గొన్నారు. ఇందులో భాగంగా సూరి పవన్ శ్రీ కుమార్ మాట్లాడుతూ విజయదశమి పండుగను చెడుపై మంచి గెలిచిన రోజు గా మనం జరుపుకుంటామని తెలిపారు. ఈ నవరాత్రులలో అను, వారిని రోజుకు ఒక అలంకారముతో పూజిస్తామని, ప్రతి అలంకారానికి ఒక విశిష్టత ఉందని విద్యార్థిని విద్యార్థులకు ఒక చిన్న కథ రూపంలో వివరించారు. ఈ వేడుకలలో భాగంగా విద్యార్థినిలు చేసిన నవదుర్గల నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ రాజ రాజేశ్వరి పాల్గొన్నారు.

'రైతు రుణాల సమస్య పరిష్కారానికి చర్యలు'

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం బిబి గూడెం గ్రామంలో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన ఈనాం భూముల రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లాస్థాయి సహకార బ్యాంకు అధికారులు హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం గన్నవరం సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయానికి జిల్లా చైర్మన్ నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చాయి. బీబీ గూడెంలో రైతులకు రుణాలు ఇవ్వకపోవడంతో ఆగ్రహించి సహకార సంఘం కార్యాలయానికి తాళాలు వేశారు. దీంతో జిల్లా సహకార బ్యాంకు చైర్ పర్సన్ పద్మావతి, అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను పూర్తిస్థాయిలో పరిశీలించి రైతులకు అవసరమైన రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. బ్రాంచ్ మేనేజర్ సంపత్ మాట్లాడుతూ రైతులకు పూర్తిస్థాయిలో సహకారం అందించడంలో సహకార వ్యవస్థ ఇప్పుడు ముందుంటుందని తెలిపారు. బీబీ గూడెం సహకార సంఘం అధ్యక్షులు బి మురళీకష్ణ మాట్లాడుతూ రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇవ్వడంలో సంఘం ముందుందని చెప్పారు. అయితే ఈనాం భూములకు పట్టాలు ఇవ్వడం వల్ల వాటి వివరాలు రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించడం జరిగిందని తద్వారా రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా కలిగిందని చెప్పారు. అలాంటి భూములకు రుణాలు ఇవ్వడానికి అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడం వల్ల చాలామంది బ్యాంకు చుట్టూ తిరగాల్సి వచ్చిందన్నారు. పది రోజుల్లో సమస్య పరిష్కరించాలని కోరారు.

ఎలుకల నివారణకు మందులు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలంలోని బుద్ధవరం గ్రామంలో ఎంపిపి అనగాని రవి, సర్పంచి బడుగు బాలమ్మ, ఏవో లక్ష్మీ తేజస్వి రైతులకు ఎలుకల నివారణ మందులు పంపిణీ చేశారు. అనగాని రవి మాట్లాడుతూ ప్రతి రైతు ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి అవకాశాలని సద్మినియోగం చేసుకోవాలని కోరారు. జడ్పిటిసి ఎలిజబెత్ రాణి, విలేజ్ అగ్రి అడ్వైజర్ బి. ప్రసాద్ పాల్గొన్నారు.









సాంస్కృతిక సందడి

- అలరించిన 'సేఫ్' అంతర కళాశాలల ఉత్సవాలు
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- ఓవరాల్ ఛాంప్ పి.బి.సిద్ధార్థ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: సేఫ్ (స్టెప్ ఎహెడ్ ఫర్ ఈక్వాలిటీ) – సిద్ధార్థ ఫార్మశీ కళాశాల ఆధ్వర్యంలో సంయుక్తంగా జరిగిన అంతర కళాశాలల సాంస్కృతికోత్సవాలు అంబరాన్నంటేలా సందడిగా జరిగాయి. ఈ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను మొగల్‌రాజపురంలోని పి.బి.సిద్ధార్థ కళాశాల కైవశం చేసుకుంది. మొత్తం తొమ్మిది అంశాలలో జరిగిన పోటీల్లో పిబి సిద్ధార్థ కళాశాల జట్టు 41 పతకాలు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఆంధ్రా లయోలా కళాశాల రన్నరప్‌గా నిలిచింది. గత రెండు రోజుల నుండి సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న అంతర కళాశాలల సాంస్కృతిక పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు సభలో కెవిఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేఫ్ అధ్యక్షులు జి.జ్యోత్స్న, సిద్ధార్థ ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచంట సునీత తదితరులు పాల్గొన్నారు.









ముగింపు సభలో మాట్లాడుతున్న కెవిఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల కన్వీనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్



విజేతల వివరాలు

స్ట్రీట్ ప్లే: ఆంధ్రా లయోలా కళాశాల – ప్రథమ స్థానం, పి.బి.సిద్ధార్థ ద్వితీయ స్థానం సాధించాయి.

మైమ్: ఎఎఎన్‌ఎం పాలిటెక్నిక్ కళాశాల (గుడ్లవల్లేరు) ప్రథమ స్థానం, విజ్ఞాన్ కాలేజ్ ఆఫ్ ఫార్మశీ (వడ్లమూడి) ద్వితీయ స్థానం, ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాల తృతీయ స్థానం సాధించాయి.

స్కిట్ : పి.బి.సిద్ధార్థ, కెవిఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల, ఎఎఎన్‌ఎం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.

సెల్ఫ్ డిఫెన్స్: పి.బి.సిద్ధార్థ, ఆంధ్రా లయోలా కళాశాల, విజ్ఞాన్ ఫార్మశీ కళాశాల (గుంటూరు) మొదటి మూడు స్థానాలు సాధించాయి.

డిబేట్: విజ్ఞాన్ ఫార్మశీ కళాశాల, ఆంధ్రా లయోలా కళాశాల, కె.బి.ఎన్ కళాశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి.

మిస్టర్ అండ్ మిస్ సేఫ్: మిస్ సేఫ్‌గా ఆంధ్రా లయోలా కళాశాలకు చెందిన ఆకాంక్ష , కన్సలేషన్ బహుమతిగా ఎస్.సుల్తానా బహుమతులు సాధించారు.

డ్రామా: శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల, పి.బి.సిద్ధార్థ కళాశాల, ఆంధ్రా లయోలా కళాశాల మొదటి మూడు స్థానాలు సాధించాయి.

ఫ్లాష్‌మాబ్: కెవిఎస్‌ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాల, పి.బి.సిద్ధార్థ కళాశాల, ఆంధ్రా లయోలా కళాశాల మొదటి మూడు స్థానాలు సాధించాయి.

కేన్సర్ నియంత్రణకు వైద్యశిబిరాలు దోహదం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న రామలింగేశ్వరరావు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రస్తుతం సమాజంలో అతి ఖరీదైన వ్యాధిగా కేన్సర్ ఉందని, దాని నియంత్రణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయమని ఎల్‌ఐసి విజయవాడ బ్రాంచి-1 సీనియర్ మేనేజర్ రామలింగేశ్వరరావు అన్నారు. ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, ఎల్‌ఐసి సిబి-1 విజయవాడ, మణిపాల్ ఆసుపత్రి (తాడేపల్లి) సంయుక్త ఆధ్వర్యంలో కేన్సర్ నియంత్రణలో భాగంగా శుక్రవారం మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపును రామలింగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమాజంలో నిరాదరణకు గురైన పేదలు, వద్ధులు, వీధిబాలలు, అనాధలకు అనేక రూపాల్లో సహాయ సహకారాలు అందించటం ముదావహమన్నారు. మణిపాల్ ఆసుపత్రి కేన్సర్ విభాగం డాక్టర్ పి.నాగమణి మాట్లాడుతూ కేన్సర్‌లో వందకు పైగా రకాలున్నాయని వివరించారు. ఓపెన్ హార్ట్ సోషల్ ఆర్గనైజేషన్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ ట్రస్టీ ఆర్.నందకిశోర్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా గత 14 సంవత్సరాలుగా వివిధ తరగతుల ప్రజానీకానికి ఆర్థిక సహాయం చేస్తూ ఆదుకుంటున్నామన్నారు. వృత్తి శిక్షణలు, అవసరమైన పనిముట్లు, పరికరాలు, దుస్తులు, ఆహారం ప్యాకెట్లు పంపిణీ వంటివి చేస్తున్నామనానరు. ఎన్‌టిఆర్ విజయవాడ, కష్ణాజిల్లాతోపాటుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రకతి విపత్తులు సంభవించినప్పుడు బాధితులకు దుస్తులు, బియ్యం, వంట సామాగ్రి వంటివి అందిస్తున్నామన్నారు.

ప్రభుత్వాల విధానాలతోనే ప్రజలపై ధరాభారం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు
- నేడు 'ప్రజాపోరు పాదయాత్ర' ముగింపు సభ

ప్రజాశక్తి-విజయవాడ: అభివృద్ధి, సంక్షేమం మాటున కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు ధరలు, పన్నుల భారాలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. సిపిఎం ప్రజాపోరు పాదయాత్ర శుక్రవారం 27, 28, 31, 32 డివిజన్లలోని దుర్గాపురం, భానునగర్, సత్యనారాయణపురం, ముత్యాలంపాడు ప్రాంతాల్లో జరిగింది. చెత్త పన్ను, విద్యుత్ ఛార్జీలు, ఉపాధి, నిరుద్యోగం, ధరల మోత తదితర సమస్యలను ఆయా ప్రాంతాల ప్రజలు నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ధరలను, భారాలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ప్రజాపోరాటాల ద్వారానే వీటిని అదుపు చేయగలమని, అందుకు సిపిఎం నిర్వహించే పోరాటాల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తానని, సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానని తొమ్మిది సంవత్సరాల క్రితం నరేంద్ర మోడీ మాట ఇచ్చి అధికారంలోకి వచ్చి నమ్మకద్రోహం చేశారని విమర్శించారు. పన్నుల బాదుడు అరికడతానని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇస్తానని సిఎం జగన్మోహన్‌రెడ్డి మాట ఇచ్చి నేడు మడమ తిప్పారని ధ్వజమెత్తారు. కేంద్రం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ ప్రజల సొమ్ముతో వారికి రాయితీలు కల్పిస్తూ ప్రజలపై ధరల, పన్నుల భారాలను మోపుతోందన్నారు. దేశమంతా పెత్తనం చేసే దష్టి తప్ప, ధరలు, నిరుద్యోగం వంటి ప్రధాన సమస్యలను పరిష్కరించటంపై ఏ మాత్రం చిత్తశుద్ధి ప్రదర్శించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు, చెత్త పన్ను ఇతర భారాలను రద్దు చేయాలని కోరారు. కార్పొరేట్ల దోపిడీ, పాలకుల అవినీతి వల్లే విద్యుత్ భారాలు పెరిగాయన్నారు. ప్రజల దృష్టిని మళ్లించి విద్వేషాలు రగిలించే పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి భూపతి రమణారావు, సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు టి.ప్రవీణ్, కె.దుర్గారావు, ఎంవి సుధాకర్, నాయకులు వై.సుబ్బారావు, చింతల శ్రీను, పి.కృష్ణమూర్తి, ఎస్‌కె పీరుసాహెబ్, యం.బాబురావు, ఎస్.కె.షకీలా, మైలవరపు బాలాజీ, మల్లంపల్లి శివ, పి.సాంబిరెడ్డి, టి.ప్రభుదాసు పాల్గొన్నారు. ప్రజాపోరు పాదయాత్ర సెంట్రల్ నియోజకవర్గంలో శనివారంతో ముగుస్తుందని, ఈ సందర్భంగా మహంతిమార్కెట్ సెంటర్‌లో జరిగే ముగింపు సభలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని నాయకులు కోరారు.



అధిక ధరలపై నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి

- సిపిఎం కృష్ణా జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు
- ప్రజాబ్యాలెట్‌కు విశేష స్పందన



కంకిపాడులో...

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా): తమది పేదల ప్రభుత్వం, పెత్తందారులపై తమ పోరాటం అని చెబుతూ ప్రజలపై భారాలు వేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని పలువురు వామపక్ష నాయకులు స్పష్టం చేశారు.విద్యుత్ సంస్క రణల పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న విద్యుత్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ , సిపిఎం, సిపిఐ,సీపీఐ (ఎం ఎల్) మచిలీపట్నం కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కోనేరు సెంటర్‌లో ప్రజా బ్యాలెట్ నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రకరకాల పేరుతో రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ప్రజల పై వేస్తున్న విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగు సంవత్సరాల కాలంలో 25 వేల కోట్ల రూపాయలు కరెంటు చార్జీలు పేరుతో ప్రజలపై భారం మోపిందని, సర్‌చార్జి ల పేరుతో ప్రజలపై వేసే భారాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేదంటే రానున్న రోజుల్లో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ప్రజా బ్యాలెట్ లో మొత్తం 635 మంది తమ అభిప్రాయాలను ఓటు ద్వారా ప్రజా బ్యాలెట్ లో వేశారు .వీరిలో 626 మంది విద్యుత్ చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా, 6 అనుకూలంగా,3 తటస్థంగా వేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ రాజేష్, సీనియర్ నాయకులు కొడాలి శర్మ, కమిటీ సభ్యులు సిహెచ్ జయరావు, ఎండి యూనస్, టి చంద్రపాల్, ఎల్ఐసి యూనియన్ నాయకులు జి. కిషోర్ కుమార్, వి. ఠాగూర్, చంద్రశేఖర్, ఐద్వా పట్టణ కార్యదర్శి కే. సుజాత,బి. భవాని, సిహెచ్. అరుణ కుమారి, కెవిపిఎస్ పట్టణ అధ్యక్షులు ఎం.ఏ. బెనర్జీ, డి సత్యనారాయణ ,రైతు సంఘంనాయకులు ఈడే. రామారావు, సీపీఐ నాయకులు లింగం ఫిలిప్, ఓ.ఎల్ రావు, ఆర్టీసీ ,హమాలీ వర్కర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ :** స్థానిక స్టేషన్ రోడ్‌లో వామపక్ష పార్టీలు విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, వామపక్ష నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, సీపిఐ నేతలు సిహెచ్ సత్యనారాయణ, రామకష్ణులు, ఐద్వా నేతలు పి.రజిని, డి.అరుణ, ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, కార్మిక సంఘాల నాయకులు పి.ప్రభుదాస్, రేపాని కొండ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గూడూరు :** రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా పెడన పట్టణంలో ప్రజా బ్యాలెట్ నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపకాన్ని వ్యతిరేకిస్తూ 323 ఓట్లు పోలవగా విద్యుత్ చార్జీలను పెంపును సమర్థిస్తూ ఆరు ఓట్లు ఫోల్ అయ్యాయి. ఈ సందర్భంగా సజ్జ నాగేశ్వరరావు మాట్లాడుతూ అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు మూడు రెట్లు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉన్నారని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.జ్యోతి మాట్లాడుతూ అడ్డగోలుగా ఆదాని కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో రాష్ట్రంలోని ప్రజలపై విపరీతమైన భారాలను మోపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచల రామ నరసిం హారావు, వాసా గంగాధర్‌రావు, తిరువీధుల బాపనయ్య, పేరుశెట్టి విశ్వనాథం, పొన్నా సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శివ నాగేంద్రం అన్నారు. శుక్రవారం ప్రజా బ్యాలెట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని కోరారు.ఈ సందర్భంగా కరెంట్ చార్జీలు తగ్గించాలని ప్రజా ఓటింగ్ బ్యాలెట్ నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వ్యతిరేకంగా 470 ఓటేశారని, మిగిలిన 30 మంది అనుకూలంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బి రాజేష్ పట్టణ కమిటీ సభ్యులు పడాల లక్ష్మణరావు నిమ్మది గోపాల్ ఎస్కే ఇస్మాయిల్ సీనియర్ నాయకులు అన్నే సుబ్బారావు బి కీర్తి నాగమణి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు ప్రధాన సెంటర్లో విద్యుత్ చార్జీల పెంపుదలకు నిరసనగా ప్రజా బ్యాలెట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోడూరు మండలంలో 82 మంది పాల్గొని విద్యుత్ చార్జీలపై తమ వ్యతిరేకతను తెలియజేశారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పోలాబత్తిన మోహన్ రావు, ఆవుల, బసవయ్య, కొప్పనాతి తాతయ్య, జనసేన పార్టీ నాయకులు ఉల్లి శేషగిరి, బడే వెంకటేశ్వరావు, జరుగు నారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి -మొవ్వ :** కూచిపూడి పెదపూడి సెంటర్లో నిర్వహించిన ప్రజాబ్యాలెట్‌కు విశేష స్పందన లభించింది. ప్రజా బ్యాలెట్ ద్వారా 186 మంది తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా అందులో ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు 180, ప్రభుత్వ అనుకూలానికి ఆరుగురు ఓటు వేశారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే వి వి ప్రసాద్ , సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నారాయణరావు, కెవి వితోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి టీ తాతయ్య, పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కోసూరు వెంకట అప్పారావు, చందోలు నాగేశ్వరరావు, శాఖా కార్యదర్శులు కొండ నాగేశ్వరరావు బోరు కాటి నరసింహారాజు, మోదుమూడిసద్గుణరావు, సిపిఎం, మండల కమిటీ సభ్యులు మద్దుల బసవయ్య, ఉప్పలపు వెంకటాద్రి, కాకి రాజశేఖర్ పాల్గొన్నారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పామర్తి కోటేశ్వరరావు తొలి ఓటు వేసి ప్రజా బ్యాలెట్ ను ప్రారంభించారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలంలో లక్ష్మీపురం సెంటర్లో విద్యుత్చార్జీల పెంపుదలకు నిరసనగా ప్రజా బ్యాలెట్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో 174 ఓట్లు వేయగా ఇందులో చెల్లని ఓటు ఒకటి, అనుకూలం ఓటు ఒకటి వచ్చింది. మిగిలినవి వ్యతిరేక ఓట్లు వచ్చాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పల్లెం వెంకటేశ్వరావు, లంకదాసుల అజయ్ ఘోష్ సిఐటియు జిల్లా కార్యదర్శి మాజేటి శ్రీనివాసరావు పొదల వెంకన్న నాగశెట్టి కష్ణ చిగురిశెట్టి నాగార్జున వంగల రాజు తదితరులు పాల్గొన్నారు. **పామర్రు:** విద్యుత్ భారాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నడ్డి విరుస్తున్నాయని సిపిఎం నాయకులు అన్నారు. విద్యుత్ భారాలకు నిరసనగా పామర్రులో ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కన్వీనర్ ఒడుగు గంగాధర్ ప్రసాద్. మండల నాయకులు ముళ్ళపూడి విల్సన్, కే నాగ భూషణం, కే లక్ష్మణ, టీ ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు :** కంకిపాడు బస్టాండ్ సెంటర్ వద్ద ప్రజా బ్యాలెట్ నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రజాబ్యాలెట్ నిర్వహించగా 500 ఓట్ల పోలవ్వగా దానిలో 495 ఓట్లు వ్యతిరేకంగా వచ్చాయి. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ రఘు, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు, మండల కార్యదర్శి టి నరేష్, సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి మ్. నరసింహారావు నాయకులు పోతురాజు నాగేశ్వరరావు, పాశం రవి, సిపిఎం పార్టీ నాయకులు వి. మరియదాసు, జె రవి ఎం చంటి తదితరులు పాల్గొన్నారు. **పెనమలూరు :** స్థానిక పోరంకి సెంటర్లో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ సిపిఎం పార్టీ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు, తాడిగడప మున్సిపాలిటీ సిపిఎం పార్టీ నాయకులు ఎస్కే ఖాసీం, సిపిఐ మండలం కార్యదర్శి మున్నంగి నరసింహారావు పెనమలూరు మండలం ఐద్వామహిళా సంఘం కార్యదర్శి పుసులూరి పాతాళలక్ష్మి, ఆర్టీసీ పెన్షనర్స్ కష్ణాజిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర ఆర్టీసీ పెన్షనర్స్ సంఘం నాయకులు అమరయ్య శాస్త్రి. సిపిఎం నాయకులు అన్నవరపు శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు పుసులూరి లక్ష్మీనారాయణ, వీసం సోమశేఖర్, సిహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో...



బంటుమిల్లిలో..



గుడూరులో...



మొవ్వలో...



పామర్రులో...



కోడూరులో...



తాడిగడపలో..



ఉయ్యూరులో...



మాట్లాడుతున్న ఈవో సురేష్‌బాబు, చైర్మన్ శేషం గోపి తదితరులు

15 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

- కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం ఇఒ కానూరి సురేష్‌బాబు, ఆలయ చైర్మన్ శేషం గోపి



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 15 నుండి 23 వరకు జరుగు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను విజయ వంతం చేయాలని కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు, ఆలయ చైర్మన్ శేషం గోపి కోరారు.ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 15వ తేదీ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వర రావు (నాని)దంపతులచే కలశ స్థాపన కార్యక్రమం జరుగునని వారిచే దసరా సందర్భంగా అమ్మవారికి నూతన పట్టు వస్త్రములు సమర్పించి ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. అమ్మవారు నిత్యం వివిధ అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చునని తెలిపారు. అలాగే అమ్మవారికి పూజా కార్యక్రమాలు, హెూమాలు, భజనలు మరియు రాత్రిపూట సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 22 వ తేదీ ఆదివారం దుర్గాష్టమి రోజున ఉదయం 9 గంటలకు అమ్మవారిని కేరళ పల్లకిపై తీన్మార్ డబ్బులు, మహిళలచే కోలాటం, కాళికా నత్య ప్రదర్శన లతో వేమవరం, వడ్లమన్నాడు, కవుతరం, గ్రామాలలో ఊరేగింపు మహెూత్సవం అత్యంత వైభవంగా జరుగునని అదే రోజు ఉదయం 11 గంటల నుండి సుమారు 40 వేల మంది కి అన్న సమారాధన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. దసరా ఉత్సవాలు 9 రోజులు కోళ్ళు, గొర్రెపోతులు గుడి చుట్టూ తిప్పుట నిషేధించినట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో ధర్మ కర్తల మండలి సభ్యులు కొమ్మనబోయిన రవిశంకర్, వల్లూరు వెంకటరావు, ఆలయ సిబ్బంది రాజశేఖర్, కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కళాకృతుల ప్రదర్శన



కళాకృతులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవని గడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాప కురాలు డాక్టర్ డి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి ఉమా రాణి పర్యవేక్షణలో అరుదైన కళాకతుల ప్రదర్శన నిర్వహించారు. గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ షేక్ అబ్దుల్ రెహమాన్ సేకరించిన అరుదైన కళాకతుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను శుక్రవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో కజకిస్తాన్ ఇరాన్ ఇరాక్ దేశాల కళాకారులు తయారుచేసిన భారతీయ సా ర్స నిక్ సాంస్కతిక కళాకతులు, రాజస్థాన్ కళాఖండాలు ప్రాచీన మధ్య ఆధునిక కాలాలకు చెందిన భారతీయ చరిత్ర పర్యాటక రంగానికి చెందిన పుస్తకాలు పేరుగాంచిన చిత్రకారుల యొక్క పెయింటింగ్స్ ను ప్రదర్శించారు. ఈ కళాకతుల ప్రదర్శనను అవనిగడ్డ కు చెందిన సెయింట్ ఆన్స్ ఎన్ఆర్ఐ వికాస్ వివిధ పాఠశాలల విద్యార్థులు సందర్శించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

వీరంకిలో 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-పమిడిముక్కల : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అభివద్ధిపథంలో నడిపిస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని వీరంకి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల పరిషత్ అధ్యక్షురాలు సుప్రజా, గ్రామ సర్పంచ్ రాసాని నాగేశ్వరమ్మ, జడ్పిటిసి వెంకటరమణకుమారి, తాసిల్దార్ రాజ్యలక్ష్మి, వైసిపి నాయకులు పరస జగన్, పాతూరి చంద్రపాల్, కాటంరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అఖిల, కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

రేషన్..పరేషాన్

తరలిస్తున్నారు. కిలోకు రూ.30 వరకు ఆర్జిస్తున్నారు. ఈనేపథ్యంలోనే జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన 50 మంది అక్రమార్కులు రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. వీరిలో ఒక్కొక్కరిపైన నాలుగు నుంచి 20కిపైగా కేసులు నమోదై ఉన్నాయి. అయినా అక్రమ రవాణా ఆగటం లేదు. అధికారులు 6 ఎ కేసులు నమోదు చేసి బియ్యం స్వాధీనం చేసుకుని వదిలేయడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. వీరిపై కఠిన చర్యలు తీసుకోకపోతే బియ్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంటుందనే చర్చ జరుగుతోంది. జిల్లా ఉన్నతాధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

10 నెలల్లో రూ.76.96 లక్షల బియ్యం స్వాధీనం

తాజాగా చల్లపల్లి పోలీసులు బియ్యం అక్రమ రవాణా దారులను అదుపులోకి తీసుకున్నారు. 190 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న లారీని స్వాధీనం చేసుకున్నారు. దీనికి కొన్ని రోజులు ముందు మచిలీపట్నంలో రెండు దఫాలుగా 354 క్వింటాళ్ళు, పెనమలూరులో రెండు దఫాలుగా 446 క్వింటాళ్లతోపాటు గన్నవరం, పామర్రు, ఘంటసాల, గన్నవరం తదితర మండలాల్లోనూ రేషన్ బియ్యాన్ని పెద్దమొత్తంలో అధికారులు ఈ నెలలో స్వాధీనం చేసుకున్నారు. గత 10 నెలల కాలంలో మొత్తం రూ.76 లక్షల 96 వేల 474 విలువైన 3,892.8 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆర్‌టిసిలో దసరా 'సందడి'

రాజమండ్రికి 303, విశాఖపట్నంనకు 151, బెంగుళూరుకు 10, చెన్నైకి 42, ఇతర ప్రాంతాలకు 267 సర్వీసులను నడుపుతున్నారు. ప్రయాణీకులకు ఇతర రాయితీలను కూడా కల్పిస్తున్నారు. రాను పోను టికెట్ ఒకేసారి తీసుకున్న వారు ప్రయాణ ఛార్జీలో 10 శాతం రాయితీ పొందవచ్చు. అలాగే ఎపిఎస్‌ఆర్‌టిసి ఈ వాలెట్ ద్వారా టికెట్ బుక్ చేసుకొని 5 శాతం, నలుగురు సభ్యులు (పిల్లలతో సహా) ఒకేసారి బుకింగ్ చేసుకోవడం ద్వారా 5 శాతం, వయో వృద్ధులకు (60 సంవత్సరాలు నిండిన వారికి) అన్ని రకాల సర్వీసుల్లో (ఎసి, నాన్ ఎసి) 25 శాతం రాయితీ పొందవచ్చని ఆర్‌టిసి అధికారులు తెలిపారు. టికెట్లను ఆన్‌లైన్ ద్వారా, తమ సమీప బస్‌స్టేషన్లలో, ఆర్‌టిసి అధీకృతి టికెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద టికెట్లు పొందవచ్చని తెలిపారు.

పిఎన్ బస్‌స్టేషన్‌లో రద్దీ

విద్యా సంస్థలకు దసరా సెలవులు ప్రకటించడంతో శుక్రవారం విజయవాడ పిఎన్ బస్‌స్టేషన్‌లో సందడి నెలకొంది. అలాగే రెండో శనివారం, ఆదివారం (రెండు రోజులు) సెలవులు రావడంతో ఉద్యోగులు, ఆయా తరగతుల ప్రజలు బంధువుల ఇళ్లకు, తమ తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు పెద్దఎత్తున తరలి రావడంతో బస్‌స్టేషన్లో రద్దీ ఏర్పడింది. ఈనెల 15 నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతుండటంతో ఆయా ప్రాంతాల నుంచి విజయవాడకు తరలి వచ్చే యాత్రికుల కోసం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్‌టిసి ఎన్‌టిఆర్ జిల్లా అధికారి ఎం.యేసుదానం తెలిపారు. ఆర్‌టిసి సర్వీసుల్లో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బస్‌స్టేషన్‌లో అన్ని రకాల సమాచారం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

దసరా ఉత్సవాల్లో పారిశ ధ్యం.. అగమ్యగోచరం...

పుష్కరాల సమయంలో పారిశుధ్య పని కాంట్రాక్టు పొందిన అదే ప్రాంతానికి చెందిన వ్యక్తే ఇప్పుడు కూడా ఆ బాధ్యతలు చూస్తున్నట్లు తెలిసింది. కానీ వ్యక్తి అనుభవాలను చూస్తే...పుష్కరాల్లో పారిశుధ్య నిర్వహణ తీరుపై అప్పట్లోనే ఆయనపై ఎన్నో విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు కూడా దసరా ఉత్సవాల పారిశుధ్య కాంట్రాక్టును విఎంసిలో బలమైన రాజకీయ శిఫారస్సుల నేపథ్యంలోనే పోతిన నరసింహారావు దక్కించుకున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఆయనకుగానీ, ఆయన తరపున బినామీగా ఉన్న వ్యక్తికిగానీ రోజుకు 1000 మంది కార్మికులను తీసుకొచ్చే సామర్థ్యం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. పని చేసిన కార్మికులకు సకాలంలో ఒప్పందం ప్రకారం ఫిష్టుకు రూ.500 చొప్పున కూలి డబ్బులు చెల్లిస్తారా లేదా? రూ.500 చెల్లించి రోజుకు ఒక్కో కార్మికుడితో ఒక షిఫ్ట్ పని చేయిస్తారా లేక రెండు షిఫ్టులు చేస్తారా, అసలు 1000 మంది కార్మికులను సమకూర్చే సామర్థ్యం ఉందా లేదా....ఇలా అనేక అంశాలపై అధికారులకు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే సదరు కాంట్రాక్టర్‌తోపాటు కాంట్రాక్టర్ తరపున వకల్తా పుచ్చుకున్న వ్యక్తిని విఎంసి కమిషనర్ తన ఛాంబర్‌కు పిలిపించుకుని పారిశుధ్య పని నిర్వహణపై మాట్లాడినట్లు తెలిసింది. ఉత్సవాల సమయంలో తాను పరిశీలనకు వచ్చినప్పుడు ప్రతిపాయింట్లో కార్మికులను చూపాలని, ఒక కార్మికుడితో ఒక్క ఫిష్ట్ మాత్రమే పని చేయించాలని, కూలి చెల్లింపులో కూడా వ్యత్యాసం ఉండకూడదని, ఎఫ్‌ఆర్‌ఎస్ మస్టర్ విధానం అమలు చేయాలనే నిబంధనలను కమిషనర్ వారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అయితే సదరు కాంట్రాక్టర్‌కున్న రాజకీయ పలుకుబడి నేపథ్యంలో ఇవన్నీ ఎంత వరకు అమలవుతాయో వేచిచూడాల్సిందే.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE.
O.S.46/2020

Between :
P. Demudu Raju **...Plaintiff**
And :
Prakriya constructions Pvt Ltd and Others **...Defendants**

SUMMONS

To,
D1:- Prakriya constructions Pvt. Ltd. Rep by its managing Directors, Sri Krishna Mohan Resident of Flot No. 304, Potluri Residency, Kannuru, Vijayawada-7.
D2:- Potluri Krishna Mohan s/o Late Nagendra Babu, Hindu, aged 44 years, Residing at H.No.4-200/04, Eswari Puri colony, Sainikapuri 1st Avenue, Secunderabad-94.

Please take Summons that the above suit Posted to for yours appearance on **Dt.1-11-2023 at about 10:30 AM** before The Honourable court in person or Through your advocate failing which matter will be decided exparte.

A.S.V PRASAD.
Advocat, Anakapalle

దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు : మంత్రి

ప్రజాశక్తి - విజయవాడ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో సందర్శకులకు కల్పించిన సౌకర్యాలను, అందిస్తున్న సేవలను ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించి అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఈనెల15 నుండి 23వ తేదీ వరకు ఇంద్రకీలాద్రిపై జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం నగరంలోని కలెక్టరేట్‌లో మంత్రి కొట్టు, కలెక్టర్ ఎస్.డిల్లీరావు, నగరపోలీస్ కమిషనర్ కాంతి రాణా టాటా, ఆలయ ఇవో కె.ఎస్.రామరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ మూల నక్షత్రం రోజున సరస్వతీదేవి అలంకరణలో ఉండే దుర్గమ్మకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పిస్తారని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE: N.T.R. /KRISHNA DISTRICT: AT NANDIGAMA
O.S.No. 325 of 2022

Between:
Smt. Koya Bharathi ...Plaintiff
AND
Nuthalapati Venkata Ramana Murthy ...Defendant

To
Nuthalapati Venkata Ramana Murthy, S/o late Nageswara Rao, Aged about 60 years, Occ: Business, R/o H.No.3-159, Flat No.405, Golden Plaza Apartment, Nandigama Town & Mandal, NTR District

Take notice that the above-mentioned Plaintiff filed the above O.S. No. 325/2022. The above case is posted to 30.10.2023 for your appearance either in person or through counsel at 10:30 AM before the Honble Court, failing which the matter will be heard in your absence and decide as per law.

// By order of the court //
K.V. Rajendra Prasad,
K. Janardhan Reddy
Advocates
G2-H.No. 1-5-924, Yadav Homes, New Maruthi Nagar, Chaitanyapuri, Hyderabad 500060,
Mobile: 9392400108

ప్రకటన

నా క్లయింటు అయిన జగుపిళ్ళ. అశ్విని, భర్త: రాజేష్ కుమార్, నివాసము: డోర్ నెం: 6-4-13ఎ/1, కోమట వారి వీధి, టైలర్ పేట, చిట్టినగర్, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా(సెల్ నెం: 9666368615) వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియచేయునది ఏమనగా. ది: 10-10-2023 న ఉదయము 11:00 గంటల సమయములో నా క్లయింటు తన కొనుగోలు చేసిన ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఇలాకా, విజయవాడ మునిసిపల్ కార్పొరేషను ఏరియా, విజయవాడ 1 టౌన్, చిట్టినగర్, కే.ఎల్ రావుపార్కు వీధి, సిండికేట్ బ్యాంక్ కాలనీ, విద్యాధరపురం ఆర్ఎస్ నెం: 149/1, ఎల్‌పి నెం: 4/87, ప్లాటు నెం: 103, అసెస్మెంటు నెం: 1073161852, డోర్ నెం: 5-7/8-98/9ఎ దాఖలా చ.గ.266-6లు అందులో నిర్మించబడిన జి ప్లస్ ఒన్ ఆర్‌సిసి బిల్డింగు తాలూకు స్థిరాస్తికి సంభందించిన ఒరిజినల్ దస్తావేజు నెం: (12009/2022 జాయింట్ ఎస్‌ఆర్‌ఓ విజయవాడ) కు లింకు డాక్యుమెంట్లు అయిన శ్రీ విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టరు కాబడిన **ఒరిజినల్ దస్తావేజు నెం: 5876/2014, 2242/2011, 3035/2010, 5024/2010** ర్లు, మరియు **దస్తావేజు నెం: 3127/1992** రు గల జిరాక్స్ దస్తావేజులతో పాటుగా, ఒరిజినల్ జి ప్లస్ ఒన్ ఆర్‌సిసి బిల్డింగు ప్లాన్ మరియు ప్లాన్ ప్రొసీడింగ్స్ కాపీలను జిరాక్స్ తీయించు నిమిత్తము తన బ్యాగులో పెట్టుకుని పై తెలిపిన తన ఇంటి నుంచి బయలుదేరి కె.బి.ఎన్ కాలేజీ వద్దకు వచ్చి చూసుకోగా సదరు దస్తావేజులు మార్గమధ్యములో జారిపడి పోయినవి మరియు సదరు దస్తావేజుల ఆచూకీ గురించి ఎంత వెతికినా దొరకలేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైననూ దొరికినచో నా క్లయింటునకు గాని నాకు గాని అదించగలరని, సదరు దస్తావేజులతో ఎవ్వరైననూ ఎటువంటి లావాదేవీలకు పాల్పడిననూ మా క్లయింటును బైండు చేయజాలవని తెలియచేయటమైనది.

ఇట్లు: **షేక్ బాజీ,**
అడ్వొకేట్, విజయవాడ
14-10-23. **సెల్ నెం: 8341139575**

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పాతూరు గ్రామ కాపురస్తురాలు శ్రీమతి సుంకర వీరాంజనేయమ్మ W/o వేణు గోపాలస్వామి (లేటు) అను నేను నా భర్త గారి తదనంతరం హిందూ వారసత్వ చట్టం ప్రకారం నాకు సంక్రమించిన ఆస్తిపై మచిలీపట్నం మండలం కానూరు గ్రామము లో ఉన్న "శ్రీ వెంకటేశ్వర PACS H-155 కానూరు" ద్వారా దీర్ఘకాలిక ఋణము పొందుటకుగాను, సదరు ఆస్తికి సంబంధించిన అన్ని దస్తావేజు పత్రములను తీసుకొని మచిలీపట్నం నుండి కానూరు గ్రామమునకు 9/10/2023 మంగళవారం ప్రయాణం చేయుచున్న సమయములో ఈ క్రింది తెలియజేయబడిన నెంబరు గల దస్తావేజులను పోగొట్టుకోవడం జరిగినది. (1224/1961, 1225/1961, 1226/1961, 1004/1961, 1005/1961, 1006/1961) సదరు దస్తావేజులు క్రిష్ణాజిల్లా పామర్రు సబ్ రిజిష్టర్ ఆఫీసులో రిజిష్టరు కాబడినవి. ఈ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యడల 8340841412. ఈ ఫోన్ నెంబరుకు సంప్రదించ వలసినదిగా ప్రార్ధిస్తున్నాము.

ఇట్లు
సుంకర వీరాంజనేయమ్మ

మహారాజశ్రీ నందిగామ 16వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి వారి కోర్టులో
GWOP NO. 61/2023

Between:-
కొత్త రూపవతి ...పిటిషనర్
మరియు
Nil ...రెస్పాండెంట్

పై నెంబర్ పిటిషన్‌ను, పిటిషనర్ తన మైనరు కుమారుడైన వెంకట సత్య రోహిత్ తరుపున ఈ దిగువ ఉదహరించిన షెడ్యూల్ దాఖల ఆస్తులను అమ్ముకొను నిమిత్తము అనుమతించ వలసినదిగా దాఖలు చేసుకుని యున్నారు. ది.17-10-2023వ తేదీన ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తమ అభ్యంతరములు తెలియజేసుకొన వలయును. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయడమైనది.

ఐటెం నెం.1:- షెడ్యూలు దాఖల 400.36 చ.గ. స్థలంలో అనిర్ధిష్టపు జాయింట్ హక్కు 38 చ.గ.స్థలం, షెడ్యూలు దాఖల స్థలంలో నిర్మాణం గావించబడుతున్న "శ్రీరంగ ఎన్ క్లేవ్" భవన సముదాయమందు గ్రౌండ్ ఫ్లోర్ లోని ఫ్లింత్ ఏరియా, బాల్కనీ, కామన్ ఏరియా 1450 చ.గ.సెల్లార్ నందు కారు పార్కింగ్ 100 చ.గ.అడుగులు గల ప్లాట్‌నెంబర్ GF-02 కు హద్దులు:
తూర్పు: ఓపెన్ టు స్కై
దక్షిణం: ఓపెన్ టు స్కై రోడ్డు వైపు
పడమర: స్టెప్స్ ,కామన్ కారిడార్ , లిఫ్ట్
ఉత్తరం :ఓపెన్ టు స్కై

ఐటెం నెం. 2: షెడ్యూలు దాఖలా 400. 36చ.గ. జాయింట్ హక్కు గల 38చ.గ. స్థలము , షెడ్యూల్ దాఖల స్థలంలో నిర్మాణం గావించబడుతున్న "శ్రీరంగ ఎన్ క్లేవ్" భవన సముదాయం నందు సెకండ్ ఫ్లోర్ లోని ఫ్లింత్ ఎరియా, బాల్కనీ, కామన్ ఏరియా 1250 చ.గ. సెల్లార్ నందు కారు పార్కింగ్ 100 చ.గ. అడుగుల ఫ్లాట్ నెంబర్ S.F.-01 కు హద్దులు :-
తూర్పు: స్టెప్స్, కామన్ కారిడార్, లిఫ్ట్
దక్షిణం: ఓపెన్ టు స్కై రోడ్డు వైపు
పడమర: ఓపెన్ టు స్కై
ఉత్తరం: ఓపెన్ టు స్కై

//శ్రీ కోర్టు వారి అనుమతితో//
యర్రం రెడ్డి బాబురావు,
అడ్వకేట్, నందిగామ.
సెల్ నెం: 9440761334.

మహారాజశ్రీ మోటార్ యాక్సిడెంట్స్ క్లైయిమ్స్ ట్రిబ్యునల్ మరియు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టు, ఖమ్మం
MVOP No. 619/2022

Between:
మరీదు చరణ్ సాయి (మైనర్) గార్డియన్ గా జమ్మూల శ్రీనివాస రావు ... పిటిషనర్
మరియు
మందా నాగరాజు మరియు ఇతరులు.... ప్రతివాదులు

నోటీస్

ఈ పైన చూపిన పిటీషన్ లో మొదటి ప్రతి వాదిగా మందా నాగరాజు, తండ్రి: నాగేశ్వరరావు, వయస్సు: 54 సం", వృత్తి: ట్రాక్టర్ డ్రైవర్ నెం. AP-16/AN-6435, AP-16/K-8342, R/o. H.No.7-60, S.C. కాలనీ, రాయనపాడు, విజయవాడ రూరల్ మండలం, NTR జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం..

మరియు ఇతర ప్రతివాదులు పై మోటార్ వాహన ప్రమాదం లో పిటిషనర్ తల్లి అయిన మరీదు వినీల మృతి చెందిన విషయం లో పైన చూపిన కోర్టు లో నష్టపరిహారం చెల్లించాలని మీపై కూడా కేసు దాఖలు చేసి యున్నారు.. ఇట్టి కేసు వాయిదా ది: 02-11-2023 న ఉదయం 10-30 నిమిషాలకు పైన చూపిన కోర్టు లో మీరు స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా అయిన హాజరై తగు సమాధానం తెలియచేయగలరు.. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానం చేయగలరు.

"కోర్టు వారి అనుమతి తో"
కాసర రాజశేఖర్ రెడ్డి,
తేది:14-10-2023 **వజ్రాల శ్రీలత,**
ఖమ్మం పట్టణం. **న్యాయవాదులు, ఖమ్మం.**
సెల్ : 9676686989

NAME CHANGE

I.TALAGAMSETTI NARASIMHARAO (Old Name) S/o.TALAGAMSETTI SURYANARAYANA,Resident of Door.No.7-25, Chinnagollapalem village, Kruthivennu Mandal, Krishna District-521324, Andhra Pradesh. I have changed my name as **TELAGAMSETTI NARASIMHARAO** (New Name) S/o.**TELAGAMSETTI SURYANARAYANA**.Hereafter my name is known as **TELAGAMSETTI NARASIMHARAO**, S/o.**TELAGAMSETTI SURYANARAYANA.**

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు, విజయవాడ
O.S. No. 125/2019

Between:
కెనరాబ్యాంకు, వన్‌టౌన్ బ్రాంచి, విజయవాడ, రిప్ బై జి.పి.ఎ. హోల్డర్ శ్రీ దుగ్గాని శ్రావణ్‌కుమార్...వాది
మరియు
బంకా అచ్యుతరావు ... ప్రతివాది

టు,
శ్రీ బంకా అచ్యుతరావు తండ్రి : రామమోహనరావు, డోర్ నెం. 9-2-1, వేములవారి వీధి, రామాలయం దగ్గర, మల్లిఖార్జునపేట, విజయవాడ-1.

పై నెంబరు దావానందు మీ హాజరు నిమిత్తం ది.20-10-2023 వాయిదా అయివున్నది. కావున తమరు పై కోర్టువారి యెదుట ది.20-10-2023న ఉదయం 10-30 గం.లకు తప్పక హాజరు కాగలందులకు గాను తెలియపరచడమైనది. లేనిచో మీ పరోక్షమున దావా తీర్మానించబడును.

కోట రామకృష్ణ,
విజయవాడ **అడ్వకేట్**
తేది:13-10-2023 **డోర్ నెం.14-29-26,**
సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ప్రక్కన,
గాంధీనగర్, విజయవాడ-3.
సెల్ : 9440331239

IN THE HONOURABLE COURT OF THE 1ST ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.O.P.No.748/2021

Between:
Bugatha Annapurnamma .....Petitioner
And:
Srilanki Srinivas and others....Respondents
To
The 2nd Respondent
Tumula Durga Rao, S/o Jagannadhan Naidu, Hindu, aged about not known, owner of Ashok Leyland Dost Van bearing No.AP 16 TS 4788, residing at Door No.59A-21/4-3/3, R.R.Gardens Colony, Patamata, Vijayawada, Krishna District.

Take notice that the above petition filed by the petitioner under section 166 of M.V. Act for grant of compensation and the said case is stands posted **28-11-2023 at 10:30 A.M** before the above Court for your appearance, failing which the matter will be decide in your absence.

G.V. Naidu
Advocate for the Petitioner
Therlam Village & Mandal
Vizianagaram Dist

మహారాజశ్రీ నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EA 62/2023, Ep19/16, OS 81/2014, EA 31/22, EA 19/17

Between:-
1.తోట కోటేశ్వరరావు(డైడ్)
2. తోట నాగమణి భర్త కోటేశ్వరరావు (లేటు), హిందూ వ.77సం.లు, పాత పోస్ట్ ఆఫీస్ రోడ్డు, కంచికచర్ల గ్రామం , మండలం, ఎన్టీఆర్ జిల్లా .
3. కామినేని ఉమా రాజేశ్వరి భర్త రవీంద్రబాబు, హిందూ 56 సం.లు, గృహిణి డోర్ నెం. 1-37, పెద్దబజారు, కంచికచర్ల గ్రామం, మండలం, ఎన్టీఆర్ జిల్లా.
4. సామినేని సౌజన్య దేవి భర్త మృత్యుంజయరావు, హిందూ, వయసు 54 సం.లు, గృహిణి, ప్లాట్ నెంబర్ 204, వెంకటేశ్వర ఎలైట్, 5th క్రాస్ రోడ్, సీఎం రోడ్, రైతుపేట, నందిగామ టౌన్, మండలం, ఎన్టీఆర్ జిల్లా.

మరియు

దివ్వెల లక్ష్మీనారాయణ, తండ్రి పుల్లయ్య వయసు 50 సం. లు వ్యాపారం, డోర్ నెం. 1-37 పెద్ద బజారు, కంచికచర్ల గ్రామం, మండలం, ఎన్టీఆర్ జిల్లా.

పై నెంబరు Epలో జడ్జిమెంటు డెటారుకు అభ్యంతరాలున్న తెలుపుకునే నిమిత్తం ది.8-11- 2023 వ తేదీన ఉదయం గం. 10:30ని.లకు పై కోర్టు వారి ఎదుట వాయిదా అయివున్నది. వాయిదా రోజున హాజరుకాని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

ఇట్లు
వేమూరు సత్యనారాయణ మూర్తి,
వి.వి.ఎల్.ఎన్. పూర్ణేష్,
డిహెచ్ఆర్ తరపు న్యాయవాదులు, నందిగామ.

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం : సిపిఎం



మాట్లాడుతున్న లక్ష్మణస్వామి

ప్రజాశక్తి-గన్నవరం : ప్రజలు పోరాటాల్లోకి వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం జిల్లా నాయకులు టీవీ లక్ష్మణస్వామి అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికై జరుగుతున్న ప్రజారక్షణ బేరి యాత్ర ను ఉంగుటూరు మండలం పెద్ద ఆవుటపల్లిలో శుక్రవారం ఉదయం పార్టీ సీనియర్ నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి పతాకాన్ని ఊపి ప్రారంభించారు. పెదఆవుటపల్లి , ఆత్కూరు, పొట్టిపాడు, ఆనందపురం, పోనుకుమాడు, గారపాడు, ఆముదా లపల్లి, కొయ్య గూరపాడు, లంకపల్లి,ముక్కపాడు, ఇందుపల్లి, నందమూరు, మధిరపాడు, చాగంటిపాడు ,వేంపాడు గ్రామాలలో ఈ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామాలలో జరిగిన సభల్లో లక్ష్మణ స్వామి మాట్లాడుతూ గన్నవరం నియోజక వర్గంలోని చాలా ప్రాంతాల్లో ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీలు పల్లంగా వున్నాయనీ రోడ్లు, మంచినీరు, విద్యుత్ వంటి మౌలికమైన వసతులు లేవు అన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న మొత్తం సరిపోవడం లేదనీ 5లక్షల రూపాయలకు పెంచి యివ్వాలన్నారు. కాలనీలు మెరక చేసి మౌలిక వసతులు కల్పించాలన్నారు. డెల్టా గ్రామాలన్నింటిలో 70 శాతం భూమిని కౌలురైతులే సాగు చేస్తున్నారని వారికి కౌలుకార్డులు లేవు అని తెలిపారు. యజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు ఇవ్వాలని పంట రుణాలు, సబ్సిడి పై ఎరువులు, విత్తనాలు ఇవ్వాలన్నారు. రైతుభరోసా ఇవ్వాలని పంటలు నష్టపోయినప్పుడు నష్టపరిహారం కౌలురైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజక వర్గ పరిధిలోని మిగిలిన సగ భాగం మెట్ట ప్రాంతంగా వుండి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్బికెల ద్వారా ధాన్యం అమ్మితే డబ్బులు ఆలస్యంగా వస్తున్నవని నేటికీ కాటా, రవాణా ఛార్జీలు రాలేదన్నారు. ఆర్బికెల ద్వారా మద్దతు ధరకు ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి వారంలోగా డబ్బు చెల్లించాలని కోరారు. సిపిఎం జిల్లా నాయకులు కే. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ భూ పంపిణీలో భాగంగా అనేక గ్రామాల్లో పేదలకు పాస్ పుస్తకాలు, పట్టాలు ఇచ్చారు కాని నేటికీ వారికి భూమి చూపించలేదన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూములన్నింటిని పేదలకు అప్పగించాలని పేదలు సాగు చేసుకుంటున్న భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ ప్రాంతంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అత్యధికంగా వున్నాయన్నారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా అనేక పరిశ్రమలు మూతపడుతున్నాయని ప్రభుత్వం సాయం అందించి పారిశ్రామికంగా అభివద్ధి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉంగుటూరు మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు పార్టీ నాయకులు కడవకొల్లు రామరాజు, సలీం, సీతారామరాజు, రాజారావు, శ్రీనివాస్, రామ మోహనరావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

16 నుండి కాకినాడకు బస్సు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి కాకినాడకు అల్ట్రా డీలక్స్ బస్ సర్వీసును ఈనెల 16వ తేదీ నుండి నడపనున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవనిగడ్డ నుండి ప్రతిరోజు ఉదయం 6.05 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.15 గంటలకు కాకినాడ చేరి తిరిగి కాకినాడలో మధ్యాహ్నం 02.30 గంటలకు బయలుదేరి అవనిగడ్డ రాత్రి 9.40 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. మచిలీపట్నం, బంటుమిల్లి, కత్తివెన్ను, పల్లెపాలెం, నర్సాపురం, రాజోలు, అమలాపురం, యానం మీదుగా కాకినాడ వెళ్లి తిరిగి అదే రూట్లో రావడం జరుగుతుందని చెప్పారు. ప్రయాణికులు ఈ కొత్త సర్వీసును వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు రిజర్వేషన్ సౌకర్యం కూడా కలదని తెలిపారు.



సైకిళ్లు అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు సైకిళ్లు బహూకరణ

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం జడ్పీహెచ్ స్కూల్లో 7వ తరగతి చదువుతూ మంచి ఫలితాలు సాధిస్తున్న కుంపటి శశి కుమార్, మోకరి లావణ్య ఇద్దరు విద్యార్థులకు ఉపాధ్యాయురాలు తన సొంత ఖర్చుతో సైకిళ్లు కొని విద్యార్థులకు శుక్రవారం అందించారు. లంకపల్లి గ్రామానికి చెందిన ఈ ఇద్దరు విద్యార్థులు ప్రతిరోజు నడుచుకుంటూ వచ్చి విద్య అభ్యసించడం మంచి ప్రతిభను కనబరచడంతో ఇలాంటి మంచి పిల్లల్ని ప్రోత్సహించాలనే ఉద్దేశం తో ఇంగ్లీష్ ఉపాధ్యాయిని పి కల్పవల్లి సైకిల్స్ బాహూకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయిని భువనేశ్వరి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-చల్లపల్లి : రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే సహించేది లేదని చల్లపల్లి ఎస్ఐ సీహెచ్.చినబాబు అన్నారు. గురువారం చల్లపల్లి మండలం యార్లగడ్డ నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణాకు తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందినట్లు తెలిపారు. యార్లగడ్డ చేరుకుని ఆకస్మిక తనిఖీ చేయగా లారీలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 190 కింటాళ్ళ రేషన్ బియ్యం గుర్తించి లారీతో సహా సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చినబాబు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక చౌదరిపేట రోడ్లో అనారోగ్యంతో వృద్ధురాలు చనిపోవడంతో ఆ వార్డు ప్రజలు గుడివాడ పట్టణ ఆర్.కె. వారియర్స్ కు తెలియజేయడంతో ఆ వృద్ధ తల్లికి అన్ని తామై అంత్యక్రియలు నిర్వహించారు.ఈ సందర్భంగా గుడివాడ పట్టణ జనసేన నాయకులు డాక్టర్ మాచర్ల రామకష్ణ (ఆర్.కె.) మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవ అనే నినాదంతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ మీరా షరీఫ్, మట్ట జగదీష్, కిరణ్, శివ, చరణ్, జన సైనికులు పాల్గొన్నారు.

పండుగల సందర్భంగా ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రానున్న దసరా, దీపావళి పండుగల సందర్భంగా వావ్ డీల్స్ పేరుతో ఫ్లిప్‌కార్డు ప్రత్యేక ఆఫర్లు అందిస్తుందని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఫ్లిప్‌కార్డు స్టోర్ ప్రతినిధి ఎం.ఎస్.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఫ్లిప్‌కార్డు స్టోర్‌తో పాటు ఎంపిక చేసిన ప్రాంతాలలో ఈఆఫర్లు ఉంటాయన్నారు. స్మార్ట్ ఫోన్లపై ప్రత్యేక ఆఫర్లు ఉంటాయని అలాగే కస్టమర్లకు ఎక్స్ఛేంజ్ బోనస్ కూడా ఉంటుందని తెలిపారు. డెబిట్ కార్డులపై ఈఎంఐ సౌకర్యం కూడా అందిస్తున్నామని అన్నారు. వివరాలకు ఎనికేపాడులోని ఫ్లిప్‌కార్డు స్టోర్ నందు సంప్రదించవచ్చని తెలిపారు.

నేత్రదాన సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-గుడివాడ : నేత్రదానాన్ని ప్రోత్సహిస్తూ సమాజ సేవలో ముందుకు వెళుతున్న వాసవి క్లబ్ జిల్లా నాయకులు గాదే మోహన్ బాబు అభినందనీయుడని మున్సిపల్ కమీషనర్ వడ్లాది మురళీకష్ణ పేర్కొన్నారు. ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో నేత్రదాన యజ్ఞకర్త మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా కమిషనర్ చేతుల మీదుగా సత్కరించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ మానవునికి ప్రతి అవయవము ఎంతో అవసరమని వాటిలో నేత్రాలు ఎంతో కీలకమైనవని అన్నారు. ఇప్పటివరకు మోహన్ బాబు సారధ్యంలో 280 జతల కార్నియాలు సేకరించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ కన్వీనర్ డిఆర్‌బి ప్రసాద్, సయ్యద్ గఫార్, కుడకా పార్వతీశ్వరరావు, చుండి మహేష్‌పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం : కృష్ణాజిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఏ. నారాయణస్వామి కిశుక్ర వారం గన్నవరం విమానాశ్రయంలో పుష్పగుచ్చం అందజేసి కలెక్టర్ పి.రాజబాబు స్వాగతం పలికారు.

చంద్రబాబుకు కార్పొరేట్ వైద్యమందించాలి : టిడిపి



బందరులో మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణ



గుడివాడలో మాట్లాడుతున్న రావి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల కారణంగా రాజమండ్రి కేంద్ర కారాగారంలో ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుని తక్షణమే కార్పొరేట్ వైద్యశాలకు తరలించి సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలని గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ 73 ఏళ్ళ వయసులో రాష్ట్రం కోసం తపిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేయటమే కాకుండా జైలులో కనీస వసతులు కల్పించకపోవడం దారుణ మన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ :** రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి టిడిపి అధినేత చంద్రబాబు ఆరోగ్యంపై గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వ రరావు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టిడిపి నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా 74 ఏళ్ల వయసున్న వ్యక్తి అని కూడా చూడకుండా, జైలులో కనీస వసతులు ఏర్పాటు చేయకుండా ఆయనపై కక్ష సాధింపుతో వ్యవహరించడం దుర్మార్గమని మండి పడ్డారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు కుందేటి ప్రసాద్, రెడ్డి షణ్ముఖ, అడుసుమిల్లి శ్రీనివాస్, పంచుమర్తి శ్రీను, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** చంద్రబాబు పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, వెంటనే ఆయన విడుదల చేయాలని టిడిపి నాయకులు అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు, బండి శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మాచవరపు ఆదినారాయణ, తలసిల స్వర్ణలత పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయడు ను ప్రజా క్షేత్రం నుండి దూరం చేసేందుకే జగన్‌రెడ్డి కుట్ర పన్నుతున్నారని మాజీ ఎంపి,టిడిపి జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ రావు ఆరోపించారు. శుక్రవారం స్థానిక పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో నారాయణరావు మాట్లాడుతూ రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి బాబా ప్రసాద్, ఇలియాస్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

చివరి భూముల వరకు సాగునీరివ్వకపోతే ఐక్య పోరాటం

- మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమలో ఆయుకట్టు చివరి భూముల వరకు సాగునీరు ఇవ్వకపోతే అన్ని పార్టీలతో కలిసి ఐక్య పోరాటం చేస్తామని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు ఆధ్వర్యంలో ఒకరోజు దీక్షను రాజీవ్ గాంధీ విగ్రహం సమీపంలో కోడూరు రోడ్డు ఎన్నారై పార్క్ వద్ద నిర్వహించారు. ఈ దీక్షకు బుద్ధ ప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పుట్టి పెరిగిన ప్రాంతంలో సాగునీటి సమస్య పరిష్కారం కాకపోవడం సిగ్గుచేటు అన్నారు. వైసిపి ప్రభుత్వంలో సాగునీటి వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో అవనిగడ్డ నియోజకవర్గం లో చివరి ఎకరా



జనసేన దీక్షలో పాల్గొని సంఘీభావం తెలుపుతూ ప్రసంగిస్తున్న బుద్ధ ప్రసాద్

వరకు సాగునీరు అందించామని తెలిపారు. కష్ణా గోదావరి జలాలను అనుసంధానం చేస్తూ చంద్రబాబు పట్టుసీమను కట్టిస్తే జగన్ దానిని ఒట్టి సీమ అన్నాడని, నేడు ఆ పట్టిసీమ నీళ్ళు డెల్టా ప్రాంతానికి దిక్కయ్యాయని అన్నారు. నేడు 20 మోటార్లతో నీటిని కాలువలకు తోడుతుంటే పట్టిసీమ నీళ్ల చివరి వరకు రానివ్వకుండా అడ్డుకుంటూ ఉంటే చర్యలు తీసుకోవలసిన ప్రభుత్వం ఎందుకు మాట్లాడటం లేదన్నారు. రెండు రోజులలో కాలువల సామర్థ్యానికి తగినట్లుగా సాగునీటి విడుదల చేయకపోతే రైతు సమస్యలపై అన్ని పార్టీలతో కలిసి ఐక్య కార్యాచరణ రూపొందించి ఉద్యమ ఉధతం చేస్తామని బుద్ధ ప్రసాద్ హెచ్చరించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా చేయని పక్షంలో దివిసీమ రైతులతో కలసి ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కోడూరు మండల అధ్యక్షులు మర్రే గంగయ్య, ఎంపిటిసి సభ్యులు బొప్పన భాను, లంకే భాస్కరరావు, లింగారెడ్డి పాలెం సర్పంచ్ ఎర్రంశెట్టి దామోదర్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బాదర్ల లోలాక్షుడు, నీరుసు కష్ణాంజనేయులు, గాజుల శంకర్రావు దీక్షలో పాల్గొన్నారు. టిడిపి నాయకులు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూ రీ వెంకటేశ్వరరావు, అవనిగడ్డ కోడూరు నాగాయలంక మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు, బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు పాల్గొని దీక్షలకు సంఘీభావం తెలిపారు.

సిపి కార్యాలయం నుంచి వాహన పాస్‌లు

ప్రజాశక్తి-విజయవాడ : 15వ తేది నుండి 23వ తేది వరకు ఇంద్రకీలాద్రిపై నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి విచ్చేసే మంత్రులు, న్యాయమూర్తులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు వంటి ప్రోటోకాల్ వర్తించే అత్యంత ప్రముఖులు (వివిఐపి) వారి వాహన పాస్‌ల కొరకు ముందుగానే పోలీస్ కమీషనర్ వారికి సమాచారం అందించి వారి వద్ద నుండి వాహన పాస్‌లను పొందవలసి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. వివిఐపిలు, విఐపిలు, విభిన్న ప్రతిభా వంతులు, భక్తులు వారికి కల్పించిన సౌకర్యాలను వినియో గించుకుని దసరా మహోత్సవాలు విజయవంతానికి సహక రించాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు ఆ ప్రకటనలో తెలిపారు.

దసరా ఆహ్వానం


ఆహ్వానం అందుకుంటున్న సామినేని


ఆహ్వానం అందుకుంటున్న వెలంపల్లి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 15 నుండి 23 వరకు నిర్వహించనున్న దసరా మహోత్సవాల ఆహ్వాన పత్రికను శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభానుకు అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభానుని ఆయన స్వగృహంలో కలసిన దేవస్థాన కమిటీ సభ్యులు, అధికారులు ఆహ్వాన పత్రికను, తీర్థ ప్రసాదాలను అందజేసి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. **వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై ఈనెల 15 నుండి జరుగనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నేపధ్యంలో పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాస్ దంపతులను వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని ఆయన నివాసంలో శుక్రవారం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావు, ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య, బుద్దా రాంబాబు కలిసి అమ్మవారి శరన్నవరాత్రుల ఉత్సవములు-2023 ఆహ్వాన పత్రికను, ప్రసాదములు అందజేశారు.

కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేడ



ప్రజాశక్తి - గంపలగూడెం: ఆంధ్రప్రదేశ్ జాతీయ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మేడ సురేష్ నియమితులయ్యారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు సి.వేణుగోపాల్ ఈ మేరకు ఉత్తర్వులు పంపారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సూచన మేరకు ఈ ఎంపిక జరిగింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అభివద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సురేష్ తెలిపారు. నమ్మకం ఉంచి పదవిని కల్పించిన నాయకులకు కతజ్ఞతలు తెలిపారు. 1992లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన సురేష్ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, శిక్షణ తరగతుల కన్వీనర్, రాష్ట్ర కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి, డిజిటల్ మెంబర్‌షిప్ డాష్ బోర్డు ఇన్చార్జిగా సేవలు అందించిన విషయం తెలిసిందే. గంపలగూడెం మండలం మిట్ట గూడెం గ్రామానికి చెందిన సురేష్ అంచలంచెలుగా ఎదిగారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కళ్ళే లలిత జ్ఞాపకార్థం గురువారం కళ్ళే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి, కళ్ళే జయదుర్గ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ప్రతి నెల 12వ తేదిన క్రమం తప్పకుండా పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎపి హెచ్ఒడి టెక్నికల్ ఆఫీసర్స్ అధ్యక్షుడిగా రవి

ప్రజాశక్తి - భవానీపురం : ఎపి హెచ్ఒడి టెక్నికల్ ఆఫీసర్స్ అధ్యక్షుడిగా భవిరి రవి ఎన్నికయ్యారు. శుక్రవారం గొల్లపూడిలోని ఎండోమెంట్ విభాగ సమావేశ మందిరంలో ఏపీ హెచ్ఒడి టెక్నికల్ ఆఫీసర్స్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపి హెచ్ఒడి టెక్నికల్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎల్ సోమయాజులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎపి ఎన్‌జిఒ సంఘ కోశాధికారి రంగారావు ఎన్నికల పరిశీలకునిగా వ్యవహరించారు. అధ్యక్షులుగా "ధ్వన్యనుకరణ చక్రవర్తి" ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు భవిరి రవి, కార్యదర్శిగా కె. శ్రీనివాసులు, ఫైనాన్స్ సెక్రెటరీగా టి. హేమసుందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్. రామస్వామి, ఉపాధ్యక్షుడుగా వి. ఏడుకొండలు, ఉప కార్యదర్శిగా శరత్ బాబు, మరియు ముగ్గురు ఇసి మెంబర్స్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేత్ర సమస్యలపై నిర్లక్ష్యం తగదు


ఆస్పత్రి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : మనిషి జీవితంలో ప్రతీది దృష్టితో ముడిపడి ఉందని, అందుకే కళ్లను నిర్లక్ష్యం చేయరాదని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు అన్నారు. సంధ్య కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో వరల్డ్ సైట్ డే సందర్భంగా సూర్యా రావుపేటలో నిర్వహిం చిన వాకథాన్ ను ఆయన ప్రారంభించారు. 'లవ్ యువర్ ఐస్ ఎట్ వర్క్' అనే నినాదంతో సాగిన ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభించి మాట్లాడుతూ, కంటి ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసి, నేత్ర సంబంధ సమస్యల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు సంధ్య కంటి ఆసుపత్రి నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్లను అధికంగా వినియోగించడం వల్ల దృష్టి లోపాలు తలెత్తే ప్రమాదం ఉందని, స్మార్ట్ ఫోన్లు చూడకుండా, వీడియో గేమ్స్ ఆడకుండా ఉండేలా జాగ్రత్త వహించాలని చెప్పారు. నేత్ర సమస్యలు తలెత్తిన వెంటనే వైద్య నిపుణులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి సీఈవో మునగపాటి భార్గవ్‌రామ్ మాట్లాడుతూ, ప్రజలందరికీ నేత్ర వైద్య సేవలను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో సంధ్య కంటి ఆసుపత్రి నెలకొల్పిన డాక్టర్ ఎం.ఎస్.రాజు ఆశయ సాధనకు కృషి చేస్తామని వెల్లడించారు.

టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : కూనప రాజు పర్వ గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నాగేశ్వరరెడ్డి నిరాహార దీక్షను ప్రారంభించారు. **మైలవరం :** నూజివీడు రోడ్‌లో చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరంలో శుక్రవారం నల్ల బెలూన్లు ఎగరేసి నిరసన తెలిపారు. మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడారు. **జగ్గయ్యపేట :** పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం "బాబుతో నేను" కార్యక్రమం నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ పాల్గొని పట్టణంలో పలు కళాశాల విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. **కంచికచర్ల :** వేములపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

ఆర్థరైటిస్ పట్ల నిర్లక్ష్యం వద్దు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆర్థరైటిస్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీవ్రమైన దీర్ఘకాలిక పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం వహించకుండా, సత్వర వైద్య చికిత్సలు తీసుకుంటే మెరుగైన ఫలితాలను సాధించొచ్చని మక్కెన హాస్పిటల్స్ అధినేత, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మక్కెన రవికాంత్ అన్నారు. 'ఆర్థరైటిస్ అవేర్నెస్ వీక్' పురస్కరించుకుని మక్కెన హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఆర్థరైటిస్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. నక్కలరోడ్డులోని మక్కెన హాస్పిటల్స్‌లో నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ మక్కెన రవికాంత్ మాట్లాడుతూ, ఆర్థరైటిస్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. 40 ఏళ్ల వయసు దాటిన వారు ఆర్థరైటిస్ బారినపడే అవకాశాలున్నాయని చెప్పారు. వయసు పెరగడం, హార్మోన్ల అసమతుల్యత, కీళ్లవాతం, కీళ్ల ఇన్ఫెక్షన్ కు గురికావడం వల్ల కీళు త్వరగా అరిగిపోతాయని వివరించారు. ఆర్థరైటిస్ అవగాహన వారంలో భాగంగా ఈ నెల 20వ తేదీ వరకు తమ ఆసుపత్రిలో ముందుగా రిజిస్టర్ చేయించుకున్న 200 మందికి ఉచిత కన్సల్టేషన్ అందిస్తున్నామని డాక్టర్ రవికాంత్ ప్రకటించారు. అదేవిధంగా వైద్య పరీక్షల్లో 20 శాతం, సర్జరీల్లో 10 శాతం రాయితీ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆర్థరైటిస్ అవగాహన ప్రచార పోస్టర్లను డాక్టర్ మక్కెన రవికాంత్ ఆవిష్కరించారు. బిగ్‌బాస్-6 కంటెస్టెంట్ షానీ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఓ అథ్లెట్‌గా కీళ్ల ఆరోగ్యం, పటుత్వం గురించి తనకు అవగాహన ఉందని, ఆర్థరైటిస్ వంటి ఆరోగ్య సమస్యలను తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని షానీ సూచించారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎం.రాధిక, జనరల్ సర్జన్ డాక్టర్ జి.ప్రదీప్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు


మైలవరంలో...

ప్రజాశక్తి - మైలవరం : నారాయణ పాఠశాలలో దసరాను పురస్కరించుకొని ముందుగానే శుక్రవారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం హరీష్ బసవరాజు, ఆర్ఐ గురు ప్రసాద్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** స్థానిక కెవిఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ వంటి సాంప్రదాయ పద్ధతుల నిర్వహణ వల్ల విద్యార్థులకు వివిధ విషయాలు తెలుస్తాయని ఎంఇఒ రవీందర్ నాయక్ అన్నారు. ఆడపిల్లలు పట్టు వస్త్రాలు ధరించి, బతుకమ్మ పేర్చారు. నత్యాలు చేశారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని కోదాడ రోడ్డు మార్కెట్ యార్డులో విజ్ఞాన్ విద్యాసంస్థలు ఆధ్వర్యంలో శుక్రవారం దసరా మహోత్సవాల్లో భాగంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సతీమణి విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను పాల్గొన్నారు. అనంతరం విద్యాసంస్థల యాజమాన్యం విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభానుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో


జగ్గయ్యపేటలో...

విజ్ఞాన్ విద్యాసంస్థల డైరెక్టర్ తన్నీరు సుధారాణి, లక్ష్మవిశ్వ భారతి ప్రిన్సిపల్ పద్మ శేఖర్, తదితర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గంపలగూడెం:** నెమలి గ్రామంలో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాద్ తెలిపారు. **జగ్గయ్యపేట:** మండలంలోని గండ్రాయి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు మాట్లాడారు. **తిరువూరు :** స్థానిక శ్రీనిధి టెక్నో స్కూల్లో దసరా పండుగ వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. దేవీ నవరాత్రులలో భాగంగా నవదుర్గల వేష ధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.

అన్నదానం

ప్రజాశక్తి వత్సవాయి : మండలంలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం బైండ్ల కులస్తుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపు దాసు తిరుపతిరావు సోదరుడు వల్లపుదాసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చిట్యాల గ్రామంలోని జానపాడు సైదులు స్వామి దర్గా వద్ద వల్లపు దాసు జాను కందూరు కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రివర్యులు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం హాజరయ్యారు. సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మసీదులో ఏర్పాటు చేసి పూజ గంధం మొక్కులు తీర్చే కార్యక్రమం, అన్నదానంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - వత్సవాయి : చిల్లకల్లు 220 కె.వి సబ్‌స్టేషన్‌లో భాగంగా రిపేర్ల నిమిత్తం శనివారం విద్యుత్తు సరఫరా ఉదయం 7 గంటల నుండి ఒంటిగంట వరకు వత్సవాయి మండలంలో అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వత్సవాయి విద్యుత్ శాఖ అధికారి వెంకటేశ్వరావు తెలిపారు వినియోగ దారులు సహకరించవలసిందిగా కోరారు.

మైనార్టీలను మోసం చేశారు

ప్రజాశక్తి - భవానీపురం : మైనార్టీలను పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మోసం చేశారని జనసేన విజయవాడ నగర అధికార ప్రతినిధి, మైనార్టీ నాయకులు షేక్ గయాజుద్దీన్ (ఐజా) ఘాటుగా విమర్శించారు. శక్రవారం భవానీపురంలోని తన కార్యాలయంలో మీడియాతో ఐజా మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ మరీ ముఖ్యంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ తన గెలుపుకోసం మైనార్టీలకు పలు వాగ్దానాలు చేశారని, ఎన్నికల్లో గెలిచాక మైనార్టీలకు ఇచ్చిన హామీలను అటక ఎక్కించారని ధ్వజమెత్తారు.



మాట్లాడుతున్న గయాజుద్దీన్

విశ్రాంత సైనికుడు కర్ల కోటయ్య మృతి



ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆర్మీలో 18 సంవత్సరాలు పాటు సేవలందిస్తూ 1971లో జరిగిన ప్రపంచ యుద్ధంలో వీరోచిత పోరాటం చేసిన విశ్రాంత సైనికుడు కర్ల కోటయ్య సేవలు ప్రశంస నీయమని పలువురు ప్రము ఖులు కొనియాడారు. పశ్చిమ నియోజకవర్గంలోని లంబాడీపేట కొండ ప్రాంతంలో నివసించే విశ్రాంత సైనికుడు కోటయ్య (80) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. చిన్నా పెద్దా అందరినీ ఆప్యాయంగా పలుకరించే కోటయ్య మృతి తీరనిలోటని ఎక్స్ ఆర్మీ అసోసియేషన్‌కు చెందిన పలువురు మాజీ సైనికులు కొనియాడారు. కోటయ్య భౌతిక దేహంపై జాతీయ పతాకాన్ని కప్పి గౌరవ వందనం సమర్పిం చారు. కోటయ్యకు ఇరువురు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. ఓ కుమారుడు ప్రముఖ దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. కాగా కోటయ్య అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి.